E-KABURU E-PAPER
# ఈ-కబురు
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
(తేదీ) 14-06-2025 (వారం) శనివారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com




అగ్రిగోల్డ్ బాధితులకు భారీ ఊరట » 3లో

# ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య భీకర యుద్ధం..
## మిస్సైళ్లతో విరుచుకుపడ్డ టెహ్రాన్



**ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య దాడులు తీవ్రతరం అయ్యాయి. ఇరాన్‌పై ఐడీఎఫ్ మరోసారి దాడులకు దిగడంతో ప్రతిస్పందనగా టెహ్రాన్ మిస్సైళ్లతో విరుచుకుపడింది.**

**టెల్ అవీవ్‌లో మిసైల్ దాడితో చోటుచేసుకున్న బాంబు పేలుడు**

ఈ కబురు,టెల్ అవీవ్: ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య దాడులు తీవ్రమయ్యాయి. ఇజ్రాయెల్ దాడులతో తీవ్రంగా దెబ్బతిన్న ఇరాన్ ప్రతిస్పందన దాడులు మొదలుపెట్టింది. టెల్ అవీవ్, జెరూసలెం లక్ష్యంగా మిస్సైళ్లతో విరుచుకు పడుతోంది. ఆయా ప్రాంతాల్లోని పలు లక్ష్యాలపై డజన్ల కొద్దీ క్షిపణి దాడులు చేపట్టింది. మరోవైపు వాటిని అడ్డుకునేందుకు ఇజ్రాయెల్ ఇంటర్‌సెప్టార్ కిపణులను ప్రయోగించింది. ఇరాన్ చేపట్టిన మిసైల్ దాడుల్లో టెల్ అవీవ్, జెరూసలెంలో పలుచోట్ల బాంబులు పేలుళ్లు చోటుచేసుకున్నాయి. ఈ దాడుల్లో పలువురు గాయపడ్డారు. ఇరాన్ దాడులతో ఇజ్రాయెల్ భూభాగంలో సైరన్లు మోగాయి. తమ పౌరులే లక్ష్యంగా టెహ్రాన్ దాడి చేపట్టినట్లు ఇజ్రాయెల్ పేర్కొంది. ప్రస్తుతం తమ పౌరులకు ముప్పు పొంచి ఉన్నట్లు తెలిపింది. ఇజ్రాయెల్ అంతటా డజన్లకొద్దీ లక్ష్యాలపై దాడులు చేపట్టినట్లు ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ ప్రకటించింది. మరోవైపు రెండు ఇజ్రాయెల్‌కు చెందిన ఫైటర్ జెట్‌లను కూల్చినట్లు ఇరాన్ తెలపగా, ఇజ్రాయెల్ ఆ వార్తలను తోసిపుచ్చింది. ఇరాన్ 100కు పైగా క్షిపణులను ప్రయోగించిందని ఇజ్రాయెల్ ప్రకటించింది. అయితే వాటిలో చాలా వాటిని లక్ష్యాన్ని చేరకముందే కూల్చినట్లు తెలిపింది.

తరువాయి 2లో

## విజయ్ రూపానీ కుటుంబాన్ని పరామర్శించిన ప్రధాని మోడీ



తరువాయి 2లో

## ఎలా బతికానో కూడా తెలియదు



ఈ కబురు;అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాదంలో మొత్తం 265 మందికి(ఇప్పటిదాకా అధికారిక లెక్కల ప్రకారం) మరణించారు. విమానం నుంచి ప్రాణాలతో బయటపడింది రమేష్ ఒక్కడే. ప్రస్తుతం సివిల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతన్ని ప్రధాని మోదీ పరామర్శించి ఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. మరికొన్ని జాతీయ మీడియా సంస్థలు కూడా ఆయన నుంచి వివరాలు సేకరించే ప్రయత్నాలు చేస్తున్నాయి. అయితే..

తరువాయి 2లో




## విమాన ప్రమాదంపై దర్యాప్తు
### ముమ్మరం.. బ్లాక్ బాక్స్‌పై ఎయిరిండియా ప్రకటన

**అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో ఇన్వెస్టిగేషన్ టీమ్ అత్యంత కీలకమని భావిస్తున్న బ్లాక్ బాక్స్‌పై ఎయిరిండియా కీలక ప్రకటన చేసింది. క్రాష్ అయిన బోయింగ్ 787-8 డ్రీమ్ లైనర్ ఫ్లైట్ బ్లాక్ బాక్స్ తమకు ఇంకా లభించలేదని స్పష్టం చేసింది.**

తరువాయి 2లో

ఈ కబురు: అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో ఇన్వెస్టిగేషన్ టీమ్ అత్యంత కీలకమని భావిస్తున్న బ్లాక్ బాక్స్‌పై ఎయిరిండియా కీలక ప్రకటన చేసింది. క్రాష్ అయిన బోయింగ్ 787-8 డ్రీమ్ లైనర్ ఫ్లైట్ బ్లాక్ బాక్స్ తమకు ఇంకా లభించలేదని స్పష్టం చేసింది. గుజరాత్ ఏటీఎస్ అధికారులు ప్రస్తుతం అదే పనిలో ఉన్నారని ఎయిరిండియా అధికారులు పేర్కొన్నారు. ఒకవేళ ఆ బ్లాక్ బాక్స్ దొరికితే కీలక విషయాలు వెలుగులోకి వచ్చే చాన్స్ ఉంది. సాధారణంగా ఫ్లైట్లు, హెలికాప్టర్లు క్రాష్ అయితే.. వాటిలో ఉండే బ్లాక్ బాక్స్ విచారణకు అత్యంత కీలకం. విమానం టెయిల్ భాగంలో ఆ బాక్స్‌ను ఫిక్స్ చేస్తారు. ఎండ, వాన, అగ్ని ప్రమాదం జరిగినా.. ఆరెంజ్ కలర్‌లో ఉండే ఆ బ్లాక్ బాక్స్ చెక్కుచెదరకుండా ఉంటుంది. దాంతో అసలు విమాన ప్రమాదం ఎలా జరిగిందనేది స్పష్టంగా తెలుస్తోంది. కాగా, ప్రపంచ వ్యాప్తంగా జరిగిన విమాన ప్రమాదాల్లోనూ ఇదే బ్లాక్ బాక్స్ స్పష్టమైన ఆధారాలను బయటపెట్టింది. ఇన్వెస్టిగేషన్ టీమ్ లు కీలక ఆధారాల కోసం ఆ బాక్స్‌పైనే ఆధారపడుతుంటారు. ఎయిర్‌పోర్టు నుంచి విమానం టేకాఫ్ అయిన సమయం నుంచి ల్యాండ్ అయ్యేంత వరకు కాక్‌పిట్‌లో పైలెట్లు మాట్లాడిన ప్రతి సంభాషణ స్పష్టంగా రికార్డ్ అవుతుంది.



## ప్రజలకు సాంకేతికత ఫలాలు

**ఎన్డీయే ప్రభుత్వ 11 ఏళ్ల పాలనలో సాంకేతికతను ఉపయోగించి ప్రజలకు అనేక ప్రయోజనాలను చేకూర్చామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.**

తరువాయి 2లో


ఈ కబురు,ఢిల్లీ: ఎన్డీయే ప్రభుత్వ 11 ఏళ్ల పాలనలో సాంకేతికతను ఉపయోగించి ప్రజలకు అనేక ప్రయోజనాలను చేకూర్చామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. "ఆవిష్కరణలు, సాంకేతికతను ఉపయోగించడంలో భారత యువశక్తితో విశేషమైన పురోగతి సాధించాం. ప్రపంచ సాంకేతిక శక్తిగా, స్వయంశక్తిగా ఎదిగేందుకు చేస్తున్న మా ప్రయత్నాలకు ఇది మరింత దోహదపడింది. లబ్ధిదారులకు ప్రభుత్వ సేవలు అందించడానికి, అందులో పారదర్శకతకు సాంకేతికత గొప్పగా సహాయపడింది.

## ఈపీఎఫ్ క్లెయిమ్‌లకు వేగంగా ఆమోదం
» 5లో



## ఆఫ్-రోడ్‌లో దూసుకెళ్లే 'జిమ్నీ'. లక్ష మంది కొనేశారు.
» 4లో



## 'టాటా చరిత్రలో చీకటి రోజు' ఉద్యోగులకు లేఖలో సంస్థ ఛైర్మన్

టాటా గ్రూపు చరిత్రలో చీకటి రోజుగా పేర్కొన్న సంస్థ ఛైర్మన్ ఎన్ చంద్రశేఖరన్.. దర్యాప్తు అంశంలో పూర్తి పారదర్శకంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు.

» 3లో




## భారత్‌లో బోయింగ్ డ్రీమ్‌లైనర్ విమానాలకు బ్రేక్?

ఈ కబురు,ఢిల్లీ: అహ్మదాబాద్ ఘోర విమాన దుర్ఘటన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. బోయింగ్ డ్రీమ్‌లైనర్ 787-8 విమానాలను నిలిపివేసే అంశాన్ని కేంద్రం పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. తొలుత తాత్కాలికంగా సేవలు నిలిపివేసి.. భద్రతా సమీక్ష నిర్వహించిన అనంతరం పూర్తిగా నిలుపుదల చేయాలా? కొనసాగించాలా? అన్నదానిపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

» 2లో

## రాష్ట్రంలో కొత్తగా 571 పాఠశాలలు
### ప్రారంభిస్తున్నాం: సీఎం రేవంత్‌రెడ్డి



**ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచడమే తమ లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.**

ఈ కబురు, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచడమే తమ లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించాలని, అందుకు అవసరమైన మౌలిక వసతులు, ఉపాధ్యాయులకు శిక్షణ, ఇతర సదుపాయాల కల్పనకు ఎంత ఖర్చయినా వెనుకాడేది లేదని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో 20 మంది కన్నా ఎక్కువ పిల్లలున్న గ్రామాలు, పట్టణాల్లో ఈ ఏడాది కొత్తగా 571 పాఠశాలలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో కమాండ్ కంట్రోల్ కార్యాలయంలో విద్యాశాఖ అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. బోధనా ప్రమాణాల పెంపునకు తీసుకోవాల్సిన చర్యలను సీఎం అధికారులకు సూచించారు.

తరువాయి 2లో

## నా జీవితాన్ని అందంగా మార్చినందుకు థాంక్యూ.. లవ్యూ బేబీ..
» 5లో



## ఇంగ్లండ్ నుంచి భారత్‌కు తిరిగి రానున్న గౌతమ్ గంభీర్!
» 6లో







## తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు భారీ శుభవార్త.. డీఏ పెంపు

ఈ కబురు: ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం భారీ శుభవార్త చెప్పింది. ఉద్యోగుల డీఏ 3.64 శాతానికి పెంచుతూ జీవో జారీ చేసింది.

» 3లో

## మాజీ మంత్రి కేటీఆర్‌కు మరోసారి ఏసీబీ నోటీసులు



» 2లో



## కేటీఆర్‌కు మరోసారి ఏసీబీ నోటీసులు.. స్పందించిన ఎమ్మెల్సీ కవిత

» 2లో

మొదటి పేజీ తరువాయి

# ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య భీకర యుద్ధం.. మిసైళ్లతో విరుచుకుపడ్డ టెహ్రాన్



24 గంటల్లోపే మళ్లీ దాడులు చేపట్టిన ఇజ్రాయెల్

ఇరాన్ దాడులు చేపట్టకముందు శుక్రవారం రాత్రి ఇరాన్‌పై ఇజ్రాయెల్ మరోసారి దాడులకు దిగింది. అణు, మిలిటరీ స్థావరాలే లక్ష్యంగా దాడులు చేపట్టింది. ఇస్ఫహాన్ అణుస్థావరంపై విరుచుకుపడ్డట్లు ఇజ్రాయెల్ ఆర్మీ వెల్లడించింది. రాజధాని టెహ్రాన్‌తో పాటు మొత్తం 200 లక్ష్యాలపై దాడిచేసినట్లు తెలిపింది. ఎయిర్‌ఫోర్స్ ఫైటర్ జెట్‌లు ఇస్ఫహాన్ ప్రాంతంలోని అణుస్థావరంపై విరుచుకుపడి లక్ష్యాలను ఛేదించినట్లు ఐడీఎఫ్ పేర్కొంది. ఈ ప్రాంతంలో అణుబాంబుల తయారీ కోసం యురేనియం శుద్ధి ప్రక్రియ జరుగుతోన్నట్లు ఇజ్రాయెల్ ఆర్మీ వెల్లడించింది. యురేనియం శుద్ధి కోసం వినియోగించే ల్యాబ్‌లు, ఇతర మౌలిక సదుపాయాలను ధ్వంసం చేసినట్లు పేర్కొంది. ఈ మేరకు ఇస్ఫహాన్‌లోని అణుస్థావరాలు ఉన్న నిర్మాణాలను ఎక్స్‌లో పోస్టు చేసింది. తమ దాడుల్లో ఇరాన్‌కు చెందిన పలు ఎయిర్ బేస్‌లను ధ్వంసం అయినట్లు ఐడీఎఫ్ పేర్కొంది. అవసరమైనంత మేరకు మళ్లీ దాడులు చేపడతామని ఇజ్రాయెల్ తెలిపింది.

ఇరాన్ ప్రయోగించిన మిసైళ్లను అడ్డుకుంటున్న ఇజ్రాయెల్ ఐరన్ డోమ్ ఇరాన్ నాయకత్వంపై తిరుగుబాటుకు పిలుపునిచ్చిన నెతన్యాహు టెల్‌అవీవ్, టెహ్రాన్ మధ్య తీవ్రమైన దాడులు చోటుచేసుకుంటున్న వేళ ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు కీలక ప్రకటన చేశారు. ఇరాన్ నాయకత్వంపై అక్కడి ప్రజలు తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు. ఈ క్షణాన్ని ఉపయోగించుకొని ఇరాన్ నాయకత్వానికి వ్యతిరేకంగా ఏకం కావాలని పేర్కొన్నారు. ఈ సమయంలో తాను, ఇజ్రాయెల్ ప్రజలు మీకు మద్దతుగా ఉంటారని తెలిపారు. మరోవైపు టెహ్రాన్ హద్దు మీరుతోందని, పౌర ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని క్షిపణులు ప్రయోగించిందని ఇజ్రాయెల్ రక్షణశాఖ మంత్రి యోవ్ గాల్లంట్ పేర్కొన్నారు. ఇరాన్ భారీ మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరించారు.

ఆరుగురు టాప్ మిలిటరీ కమాండర్స్ మృతి.. ఐడీఎఫ్ ఇజ్రాయెల్ శుక్రవారం చేపట్టిన దాడుల్లో మొత్తం ఆరుగురు టాప్ మిలిటరీ కమాండర్స్, తొమ్మిది మంది అణు శాస్త్రవేత్తలు మృతి చెందినట్లు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ అధికార ప్రతినిధి బ్రిగేడియర్ జనరల్ డెఫ్రిన్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో తెలిపారు. చనిపోయిన వారిలో ఇరాన్ మిలిటరీ స్టాఫ్ చీఫ్ మహమ్మద్ బఘేరీ, ఐఆర్‌జీసీ అధిపతి హొస్సేన్ సలామీ, ఖటమ్ అల్ అన్‌బియా సెంట్రల్ హెడ్‌క్వార్టర్స్ హెడ్ ఘోలమ్ అలీ రషీద్, ఐఆర్‌జీసీ ఎయిర్‌ఫోర్స్ చీఫ్ బ్రిగేడియర్ జనరల్ అమిర్ అలీ హజిజాదె, ఐఆర్‌జీసీ ఎయిర్‌ఫోర్స్ డ్రోన్ యూనిట్ కమాండ్ తాహెర్ పౌర్, ఐఆర్‌జీసీ ఎయిర్ ఫోర్స్ డిఫెన్స్ యూనిట్ కమాండర్ దావోద్ షేఖియాన్ ఉన్నారు.

ఇరాన్ క్షిపణులను అడ్డుకునేందుకు అమెరికా సాయం!

టెహ్రాన్ చేపట్టిన మిసైళ్ల దాడులను అడ్డుకునేందుకు ఇజ్రాయెల్‌కు అమెరికా సాయం చేసినట్లు అమెరికా అధికారి తెలిపారు. యాక్సియోస్ మీడియాకు ఈ విషయాన్ని ఆయన వెల్లడించారు. మరోవైపు ఇరుదేశాల పరస్పర దాడుల నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫోన్‌లో మాట్లాడినట్లు వైట్‌హౌస్ తెలిపింది.

ఇజ్రాయెల్ దాడులను ఖండించిన పుతిన్ ఇజ్రాయెల్ దాడులను రష్యా అధ్యక్షుడు పుతిన్ ఖండించారు. ఇరాన్ న్యూక్లియర్ ప్రోగ్రామ్‌ను రాజకీయ, దౌత్య పద్ధతుల్లో పరిష్కరించుకోవాలని ఇరు దేశాలను ఆయన కోరారు. ఇరు దేశాల మధ్య ప్రస్తుతం జరుగుతున్న దాడుల నేపథ్యంలో పుతిన్ రెండు దేశాల అధినేతలకు ఫోన్ చేసి మాట్లాడారు. టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులను పుతిన్ ఖండించినట్లు పేర్కొంది. యూఎన్ చార్టర్‌ను ఇది ఉల్లంఘించడమేని పేర్కొన్నారు. ఇరాన్ అధికారుల మృతికి పుతిన్ సంతాపం తెలిపినట్లు క్రెమ్లిన్ ఒక ప్రకటనలో తెలిపింది. ఫోన్‌లో మాట్లాడుకున్న ట్రంప్, సౌదీ యువ రాజుఇజ్రాయెల్, ఇరాన్ పరస్పర దాడుల నేపథ్యంలో సౌదీ యువరాజుతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్, బ్రిటన్ ప్రధాని కేర్ స్టార్మర్ ఫోన్‌లో మాట్లాడారు. పశ్చిమాసియాలో స్థిరత్వ సాధన, ఉద్రిక్తతలను తగ్గించడం, దౌత్య మార్గాల ద్వారా వివాదాలను పరిష్కారంపై వీరు చర్చించారు.

# ప్రజలకు సాంకేతికత ఫలాలు

ఈ కబురు,ఢిల్లీ: ఎన్డీయే ప్రభుత్వ 11 ఏళ్ల పాలనలో సాంకేతికతను ఉపయోగించి ప్రజలకు అనేక ప్రయోజనాలను చేకూర్చామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. ''ఆవిష్కరణలు, సాంకేతికతను ఉపయోగించడంలో భారత యువశక్తితో విశేషమైన పురోగతి సాధించాం. ప్రపంచ సాంకేతిక శక్తిగా, స్వయంశక్తిగా ఎదిగేందుకు చేస్తున్న మా ప్రయత్నాలకు ఇది మరింత దోహదపడింది. లబ్ధిదారులకు ప్రభుత్వ సేవలు అందించడానికి, అందులో పారదర్శకతకు సాంకేతికత గొప్పగా సహాయపడింది. పేదలు స్వయం సాధికారత సాధించేందుకు కూడా ఇది ఉపయోగపడింది'' అని పేర్కొన్నారు. దాదాపు 322 పథకాల కింద రూ.44 లక్షల కోట్లను ప్రత్యక్ష ప్రయోజన బదిలీ (డీబీటీ) ద్వారా లబ్ధిదారులకు ఎన్డీయే ప్రభుత్వం పారదర్శకంగా అందించినట్లు ప్రభుత్వ అధికారిక 'ఎక్స్' ఖాతా ఈ సందర్భంగా పేర్కొంది. లీకేజీలను అరికట్టడం ద్వారా మరో రూ.3.48 లక్షల కోట్లను ఆదా చేసినట్లు తెలిపింది. మోదీ నాయకత్వంలో డిజిటల్ ఇన్నోవేషన్ హబ్‌గా, సాంకేతికత ఆధారిత పరిపాలనగా, ప్రపంచ విశ్వాసంగా భారత్ మారిందని.. తయారీరంగం నుంచి అంతరిక్ష సాంకేతికత వరకు, సాంకేతిక చెల్లింపుల విధానం నుంచి గ్రామీణ అనుసంధానం వరకు మార్పు ప్రభావవంతంగా కనిపిస్తోందని పేర్కొంది.



# విమాన ప్రమాదంపై దర్యాప్తు ముమ్మరం.. బ్లాక్ బాక్స్‌పై ఎయిరిండియా కీలక ప్రకటన

ఈ కబురు: అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో ఇన్వెస్టిగేషన్ టీమ్ అత్యంత కీలకమని భావిస్తున్న బ్లాక్ బాక్స్‌పై ఎయిరిండియా కీలక ప్రకటన చేసింది. క్రాష్ అయిన బోయింగ్ 7878 డ్రీమ్ లైనర్ ఫ్లైట్ బ్లాక్ బాక్స్ తమకు ఇంకా లభించలేదని స్పష్టం చేసింది. గుజరాత్ ఏటీఎస్ అధికారులు ప్రస్తుతం అదే పనిలో ఉన్నారని ఎయిరిండియా అధికారులు పేర్కొన్నారు. ఒకవేళ ఆ బ్లాక్ బాక్స్ దొరికితే కీలక విషయాలు వెలుగులోకి వచ్చే చాన్స్ ఉంది. సాధారణంగా ఫ్లైట్లు, హెలికాప్టర్లు క్రాష్ అయితే.. వాటిలో ఉండే బ్లాక్ బాక్స్ విచారణకు అత్యంత కీలకం. విమానం టెయిల్ భాగంలో ఆ బాక్స్‌ను ఫిక్స్ చేస్తారు. ఎండ, వాన, అగ్ని ప్రమాదం జరిగినా.. ఆరెంజ్ కలర్‌లో ఉండే ఆ బ్లాక్ బాక్స్ చెక్కుచెదరకుండా ఉంటుంది. దాంతో అసలు విమాన ప్రమాదం ఎలా జరిగిందనేది స్పష్టంగా తెలుస్తోంది. కాగా, ప్రపంచ వ్యాప్తంగా జరిగిన విమాన ప్రమాదాల్లోనూ ఇదే బ్లాక్ బాక్స్ స్పష్టమైన ఆధారాలను బయటపెట్టింది. ఇన్వెస్టిగేషన్ టీమ్ లు కీలక ఆధారాల కోసం ఆ బాక్స్‌పైనే ఆధారపడుతుంటారు. ఎయిర్‌పోర్టు నుంచి విమానం టేకాఫ్ అయిన సమయం నుంచి ల్యాండ్ అయ్యేంత వరకు కాక్‌పిట్‌లో పైలెట్లు మాట్లాడిన ప్రతి సంభాషణ స్పష్టంగా రికార్డ్ అవుతుంది. అసలు విమానం కూలే ముందు వాళ్లు ఏం మాట్లాడారు..? ఏటీసీకి ఏమని సమాచామిచ్చారనే విషయాలు వెలుగులోకి రానున్నాయి. అందుకే ఇప్పుడు అదే బ్లాక్ బాక్స్ అహ్మదాబాద్ ఎయిరిండియా బోయింగ్ 7878 డ్రీమ్ లైనర్ ఫ్లైట్ ఘటనలో అత్యంత కీలక కానుంది.




మొదటి పేజీ తరువాయి

## కేటీఆర్‌కు మరోసారి ఏసీబీ నోటీసులు.. స్పందించిన ఎమ్మెల్సీ కవిత



**ఫార్ములా-ఈ కేసులో మాజీమంత్రి కేటీఆర్‌కు ఏసీబీ అధికారులు మరోసారి నోటీసులు జారీ చేయడాన్ని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత ఖండించారు.**

ఈ కబురు,హైదరాబాద్: ఫార్ములా-ఈ కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌కు ఏసీబీ అధికారులు మరోసారి నోటీసులు జారీ చేయడాన్ని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత ఖండించారు. "రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే మా వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు నోటీసులు ఇచ్చారు. కాంగ్రెస్ సర్కార్ మళ్లీ నోటీసులు జారీ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. మీరు ఎన్ని కుట్రలు పన్నినా మీ వైఫల్యాలను ప్రజా క్షేత్రంలో ఎండగడతాం" అని పేర్కొన్నారు. ఫార్ములా ఈ కేసులో ఈనెల 16న విచారణకు రావాలని అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) మరోసారి కేటీఆర్‌కు నోటీసులు జారీ చేసింది. మే 26నే ఈ కేసులో విచారణకు హాజరు కావాలని గతంలో ఏసీబీ నోటీసులు ఇచ్చింది. విదేశీ పర్యటన షెడ్యూల్ ఉందని.. తిరిగి వచ్చాక హాజరవుతానని కేటీఆర్ సమాధానం ఇచ్చారు. దీంతో తాజాగా ఇప్పుడు విచారణకు హాజరు కావాలని కేటీఆర్‌కు ఏసీబీ మరోసారి నోటీసులు ఇచ్చింది.

మొదటి పేజీ తరువాయి

## రాష్ట్రంలో కొత్తగా 571 పాఠశాలలు ప్రారంభిస్తున్నాం: సీఎం రేవంత్‌రెడ్డి



ఈ కబురు, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచడమే తమ లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించాలని, అందుకు అవసరమైన మౌలిక వసతులు, ఉపాధ్యాయులకు శిక్షణ, ఇతర సదుపాయాల కల్పనకు ఎంత ఖర్చయినా వెనుకాడేది లేదని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో 20 మంది కన్నా ఎక్కువ పిల్లలున్న గ్రామాలు, పట్టణాల్లో ఈ ఏడాది కొత్తగా 571 పాఠశాలలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో కమాండ్ కంట్రోల్ కార్యాలయంలో విద్యాశాఖ అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. బోధనా ప్రమాణాల పెంపునకు తీసుకోవాల్సిన చర్యలను సీఎం అధికారులకు సూచించారు. ''విద్యార్థులకు భాషా పరిజ్ఞానంతో పాటు నైపుణ్యాల పెంపునకు వీలుగా విద్యావ్యవస్థను మార్చాలి. హైస్కూల్ స్థాయి నుంచి విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి కల్పిస్తే భవిష్యత్తులో వారు తమకు ఇష్టమైన రంగంలో రాణించే అవకాశం ఉంటుంది. రాష్ట్రంలో పట్టణీకరణ వేగంగా సాగుతున్న నేపథ్యంలో విద్యాశాఖ పురపాలక శాఖతో సమన్వయం చేసుకోవాలి. హెచ్ఎండీఏ, మున్సిపల్ లేఅవుట్లలో ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాల్లో పాఠశాలలు ఏర్పాటు చేయాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విభాగాల కింద ఇంటర్మీడియట్ వరకు ఉన్న విద్యా సంస్థలను హేతుబద్ధీకరించి ప్రతి పాఠశాలలో నిర్దిష్ట సంఖ్యలో విద్యార్థులు ఉండేలా చూడాలి. నాణ్యమైన భోజనం, యూనిఫాం, పాఠ్య పుస్తకాలు ఇస్తున్నందున విద్యార్థులు పెద్ద సంఖ్యలో గురుకులాల వైపు మొగ్గు చూపుతున్నారు. డే స్కాలర్లకు కూడా అవన్నీ అందించే విషయంపై అధ్యయనం చేయాలి''అని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, కే.కేశవరావు, సీఎంవో, విద్యా శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి కేటీఆర్‌కు మరోసారి ఏసీబీ నోటీసులు

మొదటి పేజీ తరువాయి

ఈ కబురు,హైదరాబాద్: భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్‌కు అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) మరోసారి నోటీసులు జారీ చేసింది. ఈనెల 16న ఉదయం 10 గంటలకు విచారణకు రావాలని నోటీసులులో పేర్కొంది. ఫార్ములా ఈరేసు కేసులో విచారణకు హాజరుకావాలని తెలిపింది. మే 26నే ఈ కేసులో విచారణకు హాజరు కావాలని ఏసీబీ నోటీసులు ఇచ్చింది. విదేశీ పర్యటన షెడ్యూల్ ఉందని.. తిరిగి వచ్చాక హాజరవుతానని కేటీఆర్ సమాధానం ఇచ్చారు. తాజాగా ఇప్పుడు విచారణకు హాజరు కావాలని కేటీఆర్‌కు ఏసీబీ మరోసారి నోటీసులు ఇచ్చింది. లై డిటెక్టర్ పరీక్షలకు నేను సిద్ధం..సీఎం సిద్ధమా? ఏసీబీ నోటీసులపై కేటీఆర్ స్పందించారు. ఫార్ములాఈ కేసులో ఈనెల 16న ఏసీబీ విచారణకు సహకరిస్తానని తెలిపారు. ''బాధ్యత గల పౌరుడిగా విచారణకు హాజరవుతా. పాలన చేతకాక ప్రజల దృష్టి మళ్లించే యత్నం ఇది. ఓటుకు నోటు కేసులో సీఎంను కూడా ఏసీబీ విచారిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసురుతున్నా. ఇద్దరం ఏసీబీ విచారణ ఎదుర్కొంటున్నాం. లై డిటెక్టర్ పరీక్షలకు నేను సిద్ధం.. మీరు సిద్ధమా? జడ్జి సమక్షంలో ఇద్దరం లై డిటెక్టర్ పరీక్షలు చేయించుకుందాం. టీవీల్లో లైవ్‌గా చూపిద్దాం. లైడిటెక్టర్ పరీక్షలు చూసి ఎవరు నేరస్థులో ప్రజలే నిర్ణయిస్తారు. నాతో పాటు లై డిటెక్టర్ పరీక్షలు చేయించుకునే ధైర్యం ఉందా? పదే పదే విచారణలతో ప్రజాధనం వృథా ఎందుకు?'' అని కేటీఆర్ ప్రశ్నించారు.



# భారత్‌లో బోయింగ్ డ్రీమ్‌లైనర్ విమానాలకు బ్రేక్?

మొదటి పేజీ తరువాయి

**అహ్మదాబాద్ ఘోర విమాన దుర్ఘటన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. బోయింగ్ డ్రీమ్‌లైనర్ 787-8 విమానాలను నిలిపివేసే అంశాన్ని కేంద్రం పరిశీలిస్తున్నట్లు సమాచారం.**

ఈ కబురు,ఢిల్లీ: అహ్మదాబాద్ ఘోర విమాన దుర్ఘటన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. బోయింగ్ డ్రీమ్‌లైనర్ 787-8 విమానాలను నిలిపివేసే అంశాన్ని కేంద్రం పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. తొలుత తాత్కాలికంగా సేవలు నిలిపివేసి.. భద్రతా సమీక్ష నిర్వహించిన అనంతరం పూర్తిగా నిలుపుదల చేయాలా? కొనసాగించాలా? అన్నదానిపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఈ మేరకు భారత్, అమెరికా ఏజెన్సీల మధ్య సంప్రదింపులు జరుగుతున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా తాజా దుర్ఘటనకు సంబంధించి దర్యాప్తు పూర్తయిన తర్వాత ఓ నిర్ణయానికి వచ్చే అవకాశముంది. ఎయిరిండియాతోపాటు విమాన నిర్వహణ విధానంపై ఇతర విమానయాన సంస్థలకు కూడా కేంద్రం నోటీసులు పంపే అవకాశముందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

అహ్మదాబాద్‌లో గురువారం జరిగిన ఘోర ప్రమాదంలో 265 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ దుర్ఘటన గగనతలంలో ప్రయాణాల భద్రతకు సంబంధించిన అంశాలను మరోసారి తెరపైకి తీసుకొచ్చింది. ప్రపంచంలోని వివిధ సంస్థల తయారీ విమానాలతో పోల్చినప్పుడు బోయింగ్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు సాంకేతికత, భద్రత, వేగం, ఇంధన వినియోగం పరంగా అత్యున్నతమైనవనే అభిప్రాయం ఉంది. అయితే, అహ్మదాబాద్ ప్రమాదం నేపథ్యంలో బోయింగ్ విమానాలు ఏ మేరకు సురక్షితమైనవనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. డ్రీమ్‌లైనర్ 787-8 విమానం బాడీని 50% కంటే ఎక్కువ కార్బన్ ఫైబర్ సమ్మేళనాలతో నిర్మిస్తారు. ఇది స్టీల్ కంటే దృఢమైనది. అల్యూమినియం కంటే తేలికైనది. దీంతో ఇంధనాన్ని సమర్థంగా వినియోగించుకొంటుంది. పర్యావరణహితమైనదిగా దీనికి పేరుంది. అత్యాధునిక నేవిగేషన్ వ్యవస్థలు దీని సొంతం.

మొదటి పేజీ తరువాయి

## విజయ్ రూపానీ కుటుంబాన్ని పరామర్శించిన ప్రధాని మోడీ

ఈ కబురు : అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మృతి చెందిన మాజీ సీఎం విజయ్ రూపానీ కుటుంబాన్ని ప్రధాని నరేంద్ర మోడీ పరామర్శించారు. ఈ సందర్భంగా.. "విజయ్ భాయ్ మన మధ్య లేరనే నిజాన్ని నమ్మలేకపోతున్నాను. చాలా ఏళ్లుగా ఆయన నాకు తెలుసు. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో, సవాళ్ళతో కూడిన సమయాల్లో విజయ్ కష్టపడి పని చేశారు. పార్టీ సిద్ధాంతానికి కట్టుబడి ఉండేవారు. వివిధ బాధ్యతలు నిర్వర్తిస్తూ ఉన్నతస్థాయికి ఎదిగి, సీఎంగా సేవలు అందించారు.." అంటూ మోడీ ట్వీట్ చేశారు. ఘటన స్థలాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శుక్రవారం ఉదయం పరిశీలించారు. కాగా అహ్మదాబాద్ ప్రమాదం పై తీవ్ర విచారం వ్యక్తం చేసిన ప్రధాని మోడీ శుక్రవారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అక్కడి పరిస్థితి, ప్రమాద వివరాలను ఆఫీసర్లను అడిగి తెలుసుకున్నారు. అహ్మదాబాద్ సివిల్ ఆసుపత్రికి చేరుకుని అక్కడ ప్రమాద బాధితులను పరామర్శించారు. ముఖ్యంగా ఈ ప్రమాదంలో మృత్యుంజయుడు రమేశ్ విశ్వాస్ కుమార్ ను ప్రధాని ప్రత్యేకంగా పరామర్శించారు. గురువారం అహ్మదాబాద్ నుంచి లండన్ లోని గాట్విక్ ఎయిర్ పోర్టుకు బయలుదేరిన కొన్ని సెకన్లలోనే ఎయిర్ ఇండియా విమానం కుప్పకూలిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీతో సహ ఇప్పటి వరకు 265 మంది చనిపోయారు.



## ఎలా బతికానో కూడా తెలియదు

మొదటి పేజీ తరువాయి

ఈ కబురు;అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాదంలో మొత్తం 265 మందికి(ఇప్పటిదాకా అధికారిక లెక్కల ప్రకారం) మరణించారు. విమానం నుంచి ప్రాణాలతో బయటపడింది రమేష్ ఒక్కడే. ప్రస్తుతం సివిల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతన్ని ప్రధాని మోదీ పరామర్శించి ఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. మరికొన్ని జాతీయ మీడియా సంస్థలు కూడా ఆయన నుంచి వివరాలు సేకరించే ప్రయత్నాలు చేస్తున్నాయి. అయితే..

.. ''నమ్మలేకపోతున్నా.. ఎలా బతికానో కూడా తెలియట్లేదు'' అంటూ అతను చెబుతున్నాడు. విమానంలో 11ఏ సీట్‌లో కూర్చున్న రమేష్.. ఎమర్జెన్సీ విండో నుంచి దూకి ప్రాణాలు రక్షించుకున్నారంటూ తొలుత పోలీసులు చెప్పారు. అతని సోదరుడు ధీరేంద్ర సోమ్‌బాయ్ కూడా అదే స్టేట్‌మెంట్ ఇచ్చారు. అయితే రమేష్ మాత్రం జరిగింది అది కాదని స్పష్టత ఇచ్చారు. అంతా క్షణాల్లో జరిగిపోయిందని, తమ విమానం నేలకూలుతుందన్న విషయం తనకు అర్థమైంది. ఆ వెంటనే విమానం కిందకు వచ్చి ముక్కలై.. పేలిపోయిందని.. ప్రమాద క్షణాలను గుర్తు చేసుకున్నారు. 40 ఏళ్ల బ్రిటిష్ఇండియన్ అయిన విశ్వాష్ కుమార్ రమేష్.. ఏదో అద్భుతం జరిగినట్లే ప్రమాదం నుంచి బయటడ్డారు. ప్రమాద సమయంలో విమానం నేలను తాకి రెండు ముక్కలైంది. ఆ సమయంలో సీటు ఎగిరి కాస్త దూరం పడిపోయింది. ఈ క్రమంలోనే నాకు గాయాలయ్యాయి. ఈ ఘోర ప్రమాదంలో అసలు ఎలా బతికానో కూడా తెలియదు అని రమేష్ ప్రధాని మోదీ సహా తనను పలకరించిన వారికల్లా చెబుతున్నాడు. ''ప్రమాదం జరిగాక నేను బతకడం కష్టమనే అనుకున్నా. అయితే నా సీటు దగ్గర్లో విమాన ప్రధాన భాగం ఉందని కనిపించింది. అక్కడ కొంచెం సందు కనిపించింది. నా సీటు బెల్ట్‌ను నెమ్మదిగా తొలగించి.. పాకుంటూ బయటకు వచ్చా. నా చుట్టుపక్కల వాళ్లలో కొందరు చనిపోయి ఉన్నారు. కొందరికి ఊపిరి ఆగిపోతున్న పరిస్థితి. అది చూశాక.. ఎలా తప్పించుకోవాలో నాకు అర్థం కాలేదు. బయటకు వచ్చాక.. విమానం పేలిపోయిందని ఏదో భాషలో(గుజరాతీ) అంతా అరుస్తున్నారు. ఆ గందరగోళ వాతావరణంలోనే నడుచుకుంటూ వచ్చి అంబులెన్స్ ఎక్కాను'' అని రమేష్ తెలిపారు. ప్రస్తుతం కోలుకుంటున్న రమేష్‌ను.. త్వరలో పోలీసులు, దర్యాప్తు కమిటీ ప్రశ్నించే అవకాశం ఉంది.



# అహ్మదాబాద్ విమాన ప్రమాదం తీవ్ర విషాదకరం

## : టిపిసిసి ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ గౌడ్


జగదీశ్వర్ గౌడ్ తో కలిసి సమావేశంలో పాల్గొన్న నాయకులు


విమాన ప్రమాద మృతులకు నివాళులర్పిస్తున్న జగదీశ్వర్ గౌడ్

**అహ్మదాబాద్ విమాన ప్రమాదం తీవ్ర విషాదకరం : టిపిసిసి ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ గౌడ్**

ఈకబురు,శేరిలింగంపల్లి : అహ్మదాబాద్ లో చోటు చేసుకున్న విమాన ప్రమాద ఘటన తీవ్ర విషాదకరమని విమాన ప్రమాదంలో పెద్ద ఎత్తున ప్రాణ నష్టం సంభవించడం తీవ్రంగా కలచి వేసిందని టి పి సి సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు వి.జగదీశ్వర్ గౌడ్ అన్నారు. అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మృతి చెందిన వారికి శుక్రవారం శేరిలింగంపల్లి పరిధిలోని నల్ల గండ్లలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ విమాన ప్రమాదంలో అమాయకులైన ప్రయాణికులు మృతి చెందడం యావత్ దేశాన్ని శోకసంద్రంలో ముంచిందన్నారు. విమానం ఆసుపత్రి మీద పడిన కారణంగా అక్కడ ఉన్న ప్రజలు సైతం మృతి చెందడం తీవ్రంగా కలిచివేసిందన్నారు. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. మృతి చెందిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపిన జగదీశ్వర్ గౌడ్ మృతుల కుటుంబాలకు అండగా ప్రభుత్వాలు నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా మౌనం పాటించి మృతులకు నివాళులర్పించిన జగదీశ్వర్ గౌడ్ క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు, స్థానికులు పాల్గొన్నారు.

# పోచమ్మ అమ్మవారి ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే గాంధీ

ఈ-కబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని మాదాపూర్ డివిజన్ సుభాష్ చంద్రబోస్ నగర్ కాలనీలో గల శ్రీశ్రీ పోచమ్మ అమ్మవారి దేవాలయ 14వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక పూజలకు తెలంగాణ పిఏసి చైర్మన్, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు ఎమ్మెల్యే గాంధీకి వేద ఆశీర్వచనం అందజేశారు. ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయంలో అమ్మవార్ల పూజలకు పెద్దపీట ఉంటుందన్నారు. పోచమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవంలో పాల్గొనడం తన అదృష్టమని అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలు సుఖ, సంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, నాయకులు సాంబశివరావు, బృందరావు, సత్యం, అక్కరావు, రాములు యాదవ్, నర్సింహ, వెంకటేష్ ,ముక్తార్, వెంకటేష్, హరి కృష్ణ ,శ్రీజ రెడ్డి, శశిరేఖలతో పాటు భక్తులు పాల్గొన్నారు.


పండితుల వేద ఆశీర్వాదం అందుకుంటున్న ఎమ్మెల్యే గాంధీ


అమ్మవారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

# అగ్రిగోల్డ్

## బాధితులకు భారీ ఊరట




ఈ కబురు : అగ్రిగోల్డ్ స్కాంలో మోసపోయిన 19 లక్షల మంది బాధితులకు న్యాయం చేసేందుకు ఈడీ చురుగ్గా పని చేస్తోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా, అండమాన్ నికోబార్ దీవుల్లోని ఈ బాధితుల నుంచి అగ్రిగోల్డ్ సంస్థ 32 లక్షల ఖాతాల ద్వారా రూ.6,380 కోట్లు వసూలు చేసి మోసం చేసింది. ఈడీ ఇప్పటి వరకు రూ.4,141 కోట్ల విలువైన 2,310 ఆస్తులను జప్తు చేసి, వాటిని వేలం వేసి డిపాజిటర్లకు చెల్లించే పనిలో ఉంది. ఈ కేసులో 33 మందిపై చార్జిషీట్ దాఖలు చేసిన ఈడీ, రూ.3,339 కోట్ల ఆస్తులను ఆంధ్రప్రదేశ్ సీఐడీకి బదిలీ చేయనుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గతంలో రూ.940 కోట్లు చెల్లించగా, ఇప్పుడు జప్తు ఆస్తుల విక్రయం ద్వారా మరింత నిధులు బాధితులకు అందజేయనుంది. సీబీఐ, సీఐడీ సహకారంతో ఈ ప్రక్రియ కొనసాగుతోంది.

# తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు భారీ శుభవార్త.. డీఏ పెంపు

ఈ కబురు: ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం భారీ శుభవార్త చెప్పింది. ఉద్యోగుల డీఏ 3.64 శాతానికి పెంచుతూ జీవో జారీ చేసింది. 2023 జనవరి 1వ తేదీ నుంచి పెంచిన డీఏ వర్తిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. కాగా, ఇటీవల రెండు డీఏలు ఇవ్వాలని రాష్ట్ర మంత్రిమండలి నిర్ణయించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా ఇవాళ ఒక డీఏ ఇచ్చిన ప్రభుత్వం, మరో ఆరు నెలల తర్వాత మరో డీఏ అందించనుంది. కాగా, ఉద్యోగులకు ప్రకటించిన ఒక డీఏ చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతి నెలా సగటున సుమారు రూ.200 కోట్లు.. ఏడాదికి దాదాపు రూ.2,400 కోట్ల అదనపు భారం ఖజానాపై పడనుందని ఆర్థికశాఖ వర్గాలు లెక్కలు తీశాయి. ఓ వైపు పెద్ద ఎత్తున అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలకు నిధుల కొరత రాకుండా చూస్తూనే మరోవైపు ఎంప్లాయీస్ సంక్షేమానికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నది. అందులో భాగంగా ఇప్పటినుంచి ప్రతినెలా రూ.700 కోట్లను రిటైర్డ్ ఎంప్లాయీస్ బెనిఫిట్స్ కోసం ఖర్చు చేయాలని నిర్ణయం తీసుకున్నది. మొత్తం ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. అందులో ఇకటి ఇవ్వడానికి సిద్ధమవగా.. మరో నాలుగు పెండింగ్‌లో ఉండనున్నాయి.




# ఇప్పటికైనా ఒప్పందం చేసుకోండి.. ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక!

ఈ కబురు: ఇరాన్ అణు సమస్యను దౌత్య మార్గాల్లో పరిష్కరించుకునేందుకు అమెరికా కట్టుబడి ఉందని ఇప్పటికే ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్న విషయం తెలిసిందే. తాజాగా అణు ఒప్పందంపై ఇరాన్‌కు ట్రంప్ మరోసారి హెచ్చరికలు చేశారు. దాడులతో విపరీత పరిణామాలే తప్ప సాధించేదేమీ లేదని.. ఇకనైనా అమెరికాతో అణు ఒప్పందం కుదుర్చుకోవాలన్నారు. పరిస్థితి చేయి దాటకముందే తమతో చర్చలు జరపాలని స్పష్టం చేశారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడుల అనంతరం ట్రంప్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. తమతో ఒప్పందం కుదుర్చుకోవడానికి ఇరాన్‌కు ఒక అవకాశం తర్వాత మరో అవకాశం ఇస్తూ వచ్చానన్నారు. యూఎస్‌తో అణు ఒప్పందం కుదుర్చుకోవాలని ఎన్నిసార్లు సూచించినప్పటికీ అందుకు టెహ్రాన్ అంగీకరించలేదని పేర్కొన్నారు. ప్రపంచంలోనే ఎక్కడా లేని అత్యుత్తమ, అత్యంత ప్రాణాంతకమైన సైనిక పరికరాలను అమెరికా తయారు చేస్తోందని.. అందులో అనేకం ఇజ్రాయెల్ వద్ద ఉన్నాయని తెలిపారు. వాటిని ఎలా ఉపయోగించాలో కూడా ఆ దేశానికి తెలుసని.. తర్వాత పరిస్థితి తాను ఊహించిన దానికంటే దారుణంగా ఉంటుందని హెచ్చరించారు. ఎన్ని చెప్తున్నప్పటికీ కొందరు ఇరాన్ నేతలు తన మాటలు పట్టించుకోకుండా ధైర్యంగా మాట్లాడుతున్నారని ట్రంప్ అన్నారు. కానీ.. భవిష్యత్‌లో ఏం జరుగుతుందో వారికి కూడా తెలియదని రాసుకొచ్చారు. ఇరాన్‌లో ఇప్పటికే చాలామంది ప్రాణాలు కోల్పోయారని.. భారీ విధ్వంసం జరిగిందని ట్రంప్ పేర్కొన్నారు. ఈ మారణహోమం మరింత దారుణంగా మారడానికి కొంత సమయం పడుతుందని.. పరిస్థితులు చేయి దాటకముందే ఇరాన్ తమతో ఒప్పందం చేసుకోవాలని సూచించారు. తాను చెప్పినట్లు చేస్తే ఇక మరణాలు, విధ్వంసాలు ఉండవన్నారు. ఇజ్రాయెల్ ఇరాన్ మధ్య నెలకొన్న తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో పశ్చిమాసియా మళ్లీ రణరంగంగా మారింది. ఇరాన్ న్యూక్లియర్ ప్లాంట్, సైనిక స్థావరాలే లక్ష్యంగా టెల్అవీవ్ వైమానిక దాడులు చేసింది. ఈ దాడుల్లో ఇరాన్ పారామిలిటరీ రెవల్యూషనరీ గార్డ్ చీఫ్ హొస్సేన్ సలామీ మృతి చెందారు. ఆ దేశ మిలిటరీ చీఫ్ మహమ్మద్ బాఘేరి కూడా మరణించారు. ఇరాన్ అణు లక్ష్యాలను దెబ్బతీసేందుకు 'ఆపరేషన్ రైజింగ్ లయన్'ను ప్రారంభించామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు పేర్కొన్నారు.ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడిచేయడాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వాగతించారు. ఇజ్రాయెల్ అద్భుతమైన దాడుల చేస్తోందని వ్యాఖ్యానించారు. ఇజ్రాయెల్, ఇరాన్ పరిణామాలపై ఓ అంతర్జాతీయ మీడియా ట్రంప్‌ను ప్రశ్నించగా.. ఆయన ఈ మేరకు స్పందించారు. '' ఇజ్రాయెల్ దాడులు అద్భుతంగా ఉన్నాయి. మేం ఇరాన్‌కు ఓ అవకాశం ఇచ్చాం. వాళ్లు సద్వినియోగం చేసుకోలేదు. పైగా తిప్పి కొట్టారు. ఎన్నిసార్లు తిరస్కరిస్తే.. పర్యవసానాలు అంతే తీవ్రతతో ఉంటాయి'' అంటూ అమెరికా ప్రతిపాదనను ఇరాన్ తిరస్కరించిన విషయాన్ని పరోక్షంగా ప్రస్తావించారు. ఆ రెండు దేశాల మధ్య యుద్ధంలో అమెరికా ప్రత్యక్షంగాగానీ, పరోక్షంగా గానీ భాగస్వామి అవుతుందా అని ప్రశ్నించగా.. దీనిపై ప్రస్తుతానికి స్పందించాలనుకోవడం లేదంటూ సమాధానం దాట వేశారు.

# 'టాటా చరిత్రలో చీకటి రోజు' - ఉద్యోగులకు లేఖలో సంస్థ ఛైర్మన్

ఈ కబురు: అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమానం ఘోర ప్రమాదానికి గురైన విషయంపై టాటా గ్రూప్ మరోసారి స్పందించింది. తమకు ఇది కష్టమైన సమయమే అయినప్పటికీ.. బాధ్యతల విషయంలో వెనక్కి తగ్గబోమని ఉద్యోగులకు రాసిన లేఖలో సంస్థ ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ పేర్కొన్నారు. సంస్థ చరిత్రలో ఇదో చీకటి రోజుగా పేర్కొన్న ఆయన.. విమాన ప్రమాదం దర్యాప్తు అంశంలో పూర్తి పారదర్శకంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ఎయిరిండియా ప్రయాణికుల భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. ''ఇది చాలా కఠిన సమయం. నిన్న జరిగిన ఘటన వర్ణించలేనిది. మేమందరం ఇంకా షాక్‌లోనే ఉన్నాం. మనకు తెలిసిన ఓ వ్యక్తిని కోల్పోతేనే ఎంతో బాధపడతాం. కానీ, ఒకేసారి ఇంతమంది చనిపోవడం నిజంగా జీర్ణించుకోలేనిది. టాటా గ్రూపు చరిత్రలో ఇదో చీకటి రోజు. ఈ మాటలు ప్రస్తుతం ఓదార్పును ఇవ్వలేవు. ప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబీకులకు, గాయాలతో బాధపడుతున్న వారికి అండగా నిలుస్తాం. అక్కడ ఏం జరిగిందో అనే విషయాన్ని మీలాగే మేమూ తెలుసుకోవాలని అనుకుంటున్నాం. ప్రస్తుతానికి సమాచారం లేకున్నా.. తప్పకుండా అన్ని విషయాలు తెలుస్తాయి'' అని టాటా గ్రూపు ఛైర్మన్ పేర్కొన్నారు. ప్రమాద ఘటనపై దర్యాప్తు జరిపేందుకు బ్రిటన్, అమెరికా నుంచి దర్యాప్తు బృందాలు అహ్మదాబాద్‌కు చేరుకున్నాయని, వారికి తమ నుంచి పూర్తి సహకారం ఉంటుందని చంద్రశేఖరన్ పేర్కొన్నారు. సమాజం పట్ల బాధ్యత విషయంలో టాటా గ్రూపు నిక్కచ్చిగా ఉంటుందని, దర్యాప్తులో వెల్లడయ్యే విషయాలపైనా పూర్తి పారదర్శకంగా ఉంటామని స్పష్టం చేశారు. ప్రమాదానికి సంబంధించిన విషయాలను తెలుసుకునేందుకు ప్రతి ఒక్కరూ ప్రయత్నిస్తున్నారని, ఈ క్రమంలో ఎన్నో ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. అయితే, అందులో కొన్ని సరైనవి, కొన్ని తప్పు కావచ్చని.. ఏదేమైనా కొంత సహనంతో ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఘోర ప్రమాదంపై దర్యాప్తులో వాస్తవాలు తెలుస్తాయని, వాటిని తెలియజేయడంలో పూర్తి పారదర్శకత ప్రదర్శిస్తామని టాటా గ్రూపు ఛైర్మన్ హామీ ఇచ్చారు. విశ్వాసం, సంరక్షణ అనే ప్రాతిపదికతోనే ఈ గ్రూపు నిర్మితమైందన్న ఆయన.. కష్టకాలమైనప్పటికీ బాధ్యతల నుంచి, ఏది సరైందో అది చేయడంలో వెనక్కి తగ్గబోమన్నారు. ఈ నష్టాన్ని తాము కూడా భరిస్తామని, వీటిని ఎన్నటికీ మరచిపోమంటూ ఉద్యోగులకు రాసిన లేఖలో చంద్రశేఖరన్ వెల్లడించారు.

# జల్దీ ఇల్లు కట్టుకోండి!


భూపాలపల్లి జిల్లా కమలాపూర్‌లో ఇళ్ల నిర్మాణ ప్రాంతాలను పరిశీలిస్తున్న గృహనిర్మాణ సంస్థ సీఈ చైతన్యకుమార్, స్థానిక అధికారులు

**ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను కోరుతున్న అధికారులు**

**ఇళ్ల వద్దకు బృందాలుగా వెళ్లి మరీ విన్నపాలు**

**భారీ వర్షా లు మొదలైతే పనులు సాగవని ఆందోళన**

**ఐదేళ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని సర్కారు లక్ష్యం**

**మొదటి విడతలో 4.50 లక్షలకు మొదలైనవి 69 వేలే**

**రెండో ఏడాది మొదలు పెట్టాల్సినవి మరో 4.50 లక్షలు**

**ఇప్పటివరకు పూర్తిగా నిర్మాణమైన ఇళ్లు రెండు మాత్రమే**

ఈ కబురు, హైదరాబాద్: రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మా ణాన్ని వేగవంతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పేదల కోసం ఐదేళ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోగా, మొదటి విడతలో 4.50 లక్షల ఇళ్లు నిర్మించి ఇవ్వాలని నిర్ణయించింది. కానీ, ఇప్పటికి పనులు మొదలైనవి 69 వేలు మాత్రమే. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి రెండో సంవత్సరం కొనసాగుతుండటంతో మరో 4.50 లక్షల ఇళ్ల నిర్మా ణానికి కూడా చర్యలు చేపట్టాల్సి ఉంది. ఈ నేప థ్యంలో ఇళ్ల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయాలని భావిస్తోంది. అసలే పనుల ప్రారంభంలో ఆలస్యం జరుగుతుండగా, ప్రస్తుతం వానాకాలం కూడా మొదలు కావటంతో ఇళ్ల నిర్మాణం మరింత మందగించనుంది. భారీ వర్షా లు ప్రారంభమైతే అసలు పనులే చేపట్టేందుకు జనం ఆసక్తి చూపరు. వ్యవసాయ పనులు ఊపందుకుంటే పనుల్లోకి వెళ్లేందుకే మొగ్గు చూపుతారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని ఇళ్ల నిర్మాణం వేగంగా జరిగేలా చూడాలని గృహనిర్మాణ శాఖ నిర్ణయించింది. అందులో భాగంగా అధికారులు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి త్వరగా పనులు ప్రారంభించాలని సూచిస్తున్నారు.

**పూర్తయిన ఇళ్లు రెండే..**

కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారంటీల్లో ఇందిరమ్మ ఇళ్లు కూడా ఉన్నాయి. దీంతో వీటి నిర్మాణాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఇటీవలి నుంచే లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు జారీ చేస్తుండటంతో నెల రోజులుగా నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు 69 వేల ఇళ్లు మాత్రమే మొదలయ్యాయి. వాటిల్లో పూర్తయినవి రెండు మాత్రమే. 15 వేల ఇళ్లకు మాత్రమే ఇప్పటివరకు ఆర్థిక సాయం పంపిణీ జరిగింది.

ఇందులో 10 వేల ఇళ్లకు సంబంధించి తొలి విడత బేస్‌మెంట్ లెవల్ నిధులు రూ.లక్ష చొప్పన విడుదల కాగా, మూడు వేల ఇళ్లకు రెండో విడత, మరో రెండు వేల ఇళ్లకు గోడలకు సంబంధించిన నిధులు విడుదలయ్యాయి. మొత్తంగా రూ.100 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యాయి. నిధులకు ఇబ్బంది లేదని, ప్రతి సోమవారం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేయనున్నట్టు ప్రభుత్వం చెబుతోంది.

**భారీ వర్షా లు పడితే ఇసుకకూ కష్టమే..**

రాష్ట్రంలో వానాకాలం మొదలు కావటంతో భారీ వర్షా లు కురిస్తే ఇళ్ల నిర్మాణ పనులకు ఆటంకాలేర్పడతాయని అధికార యంత్రాంగం భయపడుతోంది. దీంతో వర్షా లు ఊపందుకోక ముందే వీలైనన్ని ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలని భావిస్తోంది. ఈ ఇళ్లకు కావాల్సిన ఇసుకను వాగులు, వంకల నుంచి సేకరించి ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తోంది. భారీ వర్షా లు కురిసి వాగులు నీటితో నిండిపోతే ఇసుక సేకరణ కూడా కష్టమవుతుందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈలోపే వీలైనంత మందికి ఇసుకను సరఫరా చేయాలని నిర్ణయించారు. అది జరగాలంటే లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలి. ఇందుకోసం బృందాలుగా అధికారులు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి వెంటనే పనులు మొదలుపెట్టాలని కోరుతున్నారు.

# బైక్ షోరూమ్ సెక్యూరిటి గార్డు చేతివాటం




**షోరూమ్ లో రాయల్ ఎన్ ఫీల్డ్ బైక్ చోరీ**

ఈ-కబురు, శేరిలింగంపల్లి : సెక్యూరిటీ గార్డుగా తాను పనిచేస్తున్న సంస్థను కంటికి రెప్పగా కాపాడాల్సిన వ్యక్తి దొంగ అవతారం ఎత్తాడు. బైక్ షో రూమ్ లో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డు చేతివాటాన్ని ప్రదర్శించి రాయల్ ఎన్ఫీల్డ్ బైక్ ను చోరీ చేశాడు. షో రూమ్ లో విద్యుత్ మొత్తం నిలిపివేసి అంధకారంగా మార్చిన నిందితుదు బైక్ తస్కరించిన విషయం ఎవరికీ తెలియదని బ్రమపడ్డాడు కానీ షో రూమ్ లో ఉన్న సీసీ కెమెరాలు నిందితుడిని పట్టించాయి. మదీనాగూడలోని రాయల్ ఎన్ఫీల్డ్ షోరూమ్ లో చోటు చేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు మియాపూర్ పోలీసుల కథనం ప్రకారం.. మియాపూర్ శ్రీవాణి నగర్ లో నివాసం ఉండే నక్క కిషోర్ కుమార్(31) మదినగూడలో ఉన్న హెడ్వే రాయల్ ఎన్ఫీల్డ్ మోటర్ షోరూమ్ లో నైట్ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఈ నెల 2 తేదీన వేకువజామున 5.40 గంటల సమయంలో షోరూమ్ లో పవర్ మెయిన్ స్విచ్ బంద్ చేసి సర్వీస్ సెంటర్ లో ఉన్న రాయల్ ఎన్ ఫీల్డ్ క్లాసిక్ 350 బైక్ ని దొంగలించాడు. బైక్ కనబడకపోవడంతో షోరూమ్ మేనేజర్ కార్తిక్ మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. సీసీ కెమెరాల ఆధారంగా బైక్ దొంగిలించింది షోరూమ్ నైట్ సెక్యూరిటీ గార్డు కిషోర్ కుమార్ గా గుర్తించారు. ఈ మేరకు నిందితుడిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుండి రాయల్ ఎన్ ఫీల్డ్ బైక్ ని స్వాధీనం చేసుకున్నారు.

## ఈపీఎఫ్ క్లెయిమ్‌లకు వేగంగా ఆమోదం

ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) క్లెయిమ్‌ల పరిష్కారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మరింత వేగాన్ని సంతరించుకుంది. క్లెయిమ్ దరఖాస్తుల్లో 50 శాతాన్ని (ప్రధానంగా ఉపసంహరణ) మూడు రోజుల్లోనే పరిష్కరించినట్టు ఓ అధికారి తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇలా మూడు రోజుల్లోనే పరిష్కరించిన క్లెయిమ్‌లు 39 శాతంగా ఉన్నట్టు చెప్పారు.

2025 ఏప్రిల్ నుంచి జూన్ 5 మధ్య 68.96 లక్షల క్లెయిమ్‌లకు మూడు రోజుల్లో పరిష్కారం లభించింది. ప్రస్తుతం రూ.లక్ష వరకు క్లెయిమ్‌లకు ఆటోమేటెడ్ పరిష్కారం అమల్లో ఉండగా, ఈపీఎఫ్‌వో త్వరలోనే రూ.5 లక్షల వరకు క్లెయిమ్‌లకు ఈ పరిమితిని పెంచనుంది. దీంతో మరిన్ని క్లెయిమ్‌లకు వేగంగా పరిష్కారం లభించనుందని ఆ అధికారి తెలిపారు. ఈ పరిమితి పెంపునకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ ఆమోదం అవసరం లేదన్నారు. సెంట్రల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ ఇందుకు అనుమతించొచ్చని చెప్పారు.

అనారోగ్యం, విద్య, ఇంటి నిర్మాణం/కొనుగోలు, వివాహ అవసరాలకు సంబంధించిన క్లెయిమ్‌లు రూ.లక్ష వరకు ఉండి, దరఖాస్తుదారులకు అర్హతలు ఉంటే వాటికి మూడు రోజుల్లోనే క్లెయిమ్ మొత్తం మంజూరవుతున్నట్టు తెలిపారు. ముఖ్యంగా 2012కు ముందు చేరిన సభ్యుల క్లెయిమ్‌ల ధ్రువీకరణకు సమయం తీసుకుంటున్నట్టు తెలిపారు. పెన్షన్, గ్రూప్ ఇన్సూరెన్స్, ఈపీఎఫ్ ఉపసంహరణలు అన్నింటినీ 72 గంటల్లోనే పరిష్కరించాలన్నది ఈపీఎఫ్‌వో లక్ష్యమని.. ఈ దిశగా ఈపీఎఫ్‌వో కృషి చేస్తున్నట్టు చెప్పారు.

## జియో 3 కొత్త రీఛార్జ్ ప్లాన్లు.. తక్కువ ఖర్చుతో ఎక్కువ వ్యాలిడిటీ




రిలయన్స్ జియో భారతదేశపు అతిపెద్ద టెలికాం సంస్థ. దేశంలోని మొబైల్ యూజర్లలో ఎక్కువ మంది జియోను వినియోగిస్తున్నారు. మీరు కూడా జియో యూజర్ అయి ఉండి, లాంగ్ బవ్యాలిడిటీతో తక్కువ ఖర్చులో రీఛార్జ్ ప్లాన్ కోసం చూస్తున్నట్లయితే, ఈ సమాచారం మీ కోసమే. 84 రోజులు అంటే దాదాపు మూడు నెలలు వ్యాలిడిటీతో మంచి ప్రయోజనాలను అందించే మూడు రీఛార్జ్ ప్లాన్లను జియో ఇటీవల ప్రవేశపెట్టింది.

**జియో రూ.799 ప్లాన్**

జియో రూ .799 ప్లాన్ వ్యాలిడిటీ 84 రోజులు. ఇందులో అపరిమిత ఉచిత కాలింగ్ ప్రయోజనం లభిస్తుంది. దీంతోపాటు రోజుకు 1.5 జీబీ డేటా, 100 ఉచిత ఎస్ఎంఎస్‌లు లభిస్తాయి. దీనితో పాటు, జియో హాట్‌స్టార్‌కు ఉచిత యాక్సెస్ కూడా ఈ ప్లాన్‌తో పొందవచ్చు.

**జియో రూ.859 ప్లాన్**

ఈ ప్లాన్ కూడా 84 రోజుల వ్యాలిడిటీతో వస్తుంది. ఈ వ్యాలిడిటీ ఉన్నన్నిరోజులూ అపరిమిత ఉచిత కాలింగ్ ప్రయోజనం ఆస్వాదించవచ్చు. దీంతోపాటు రోజుకు 2 జీబీ డేటా, 100 ఉచిత ఎస్ఎంఎస్‌లు లభిస్తాయి. అంతే కాకుండా జియో హాట్‌స్టార్‌కు ఉచిత యాక్సెస్ కూడా ఈ ప్లాన్‌తో ఆనందించవచ్చు.

**జియో రూ.889 ప్లాన్**

జియో రూ .889 ప్లాన్ కూడా 84 రోజుల వ్యాలిడిటీతో వస్తుంది. ఇందులో అపరిమిత ఉచిత కాలింగ్, రోజుకు 1.5 జీబీ డేటా, 100 ఉచిత ఎస్ఎంఎస్ ప్రయోజనాలు లభిస్తాయి. దీంతో పాటు జియో హాట్‌స్టార్‌కు ఉచిత యాక్సెస్ కూడా ఈ ప్లాన్‌లో చేర్చారు. అలాగే జియో సావన్‌కు కూడా ఉచిత యాక్సెస్‌ను కూడా వినియోగదారులు పొందుతారు.






## ఇన్ఫోసిస్‌లో రూ.కోట్లు సంపాదిస్తున్నారు.. ఇదిగో కొత్త డేటా

ఐటీ పరిశ్రమలో ఉద్యోగులకు రూ.లక్షల్లో వేతనాలు ఉంటాయన్నది తెలిసిందే. అయితే కొంత మంది ఉన్నతోద్యోగులు రూ.కోట్లలో సైతం పరిహారాలు అందుకుంటారు. దేశంలో రెండో అతిపెద్ద ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్‌లో రూ.కోట్లు సంపాదిస్తున్నవారి సంఖ్య ఈసారి పెరిగింది. అంతక్రితం ఏడాది క్షీణత తరువాత, వార్షికంగా రూ .1 కోటి కంటే ఎక్కువ సంపాదించే ఇన్ఫోసిస్ ఉద్యోగుల సంఖ్య 2025 ఆర్థిక సంవత్సరంలో 9 శాతం పెరిగి 112కు చేరుకుంది.స్టాక్ ఇన్సెంటివ్స్ పర్క్విసైట్ విలువలో మార్పులు, అధిక వేరియబుల్ పే ఈ పెరుగుదలకు ప్రధాన కారణం. అదీకాకుండా 33 మంది అధిక సంపాదన కలిగిన ఉద్యోగులు ఇన్ఫోసిస్‌లో ఏడాది మధ్యలో చేరారు. కంపెనీ వార్షిక నివేదిక ప్రకారం.. వీరు ఒక్కొక్కరు సగటున నెలకు రూ .8.5 లక్షలకు పైగా జీతం పొందుతున్నారు. కంపెనీలో రూ .1 కోటి కంటే ఎక్కువ సంపాదించే వారి సంఖ్య 2024 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది పూర్తిగా రివర్స్ అయింది. అప్పుడు వీరి సంఖ్య అంతకు ముందు ఏడాది కంటే 17 శాతం తగ్గింది.

చారిత్రాత్మకంగా 2023 ఆర్థిక సంవత్సరం అత్యధికంగా 124 మంది ఉద్యోగులను నమోదు చేయగా, 2020 ఆర్థిక సంవత్సరం గత ఆరేళ్లలో అత్యల్పంగా 74 మందిని నమోదు చేసింది. ఈ జాబితాలో భారత్‌కు చెందిన ఉద్యోగులు మాత్రమే ఉన్నారని, టాప్ 10 ఎగ్జిక్యూటివ్ లను మినహాయించారని కంపెనీ స్పష్టం చేసింది. ఈ 112 మంది ఉద్యోగుల మొత్తం వేతనం 2025 ఆర్థిక సంవత్సరంలో రూ.203 కోట్లుగా ఉంది. సీఎఫ్‌వో జయేశ్ సంఘ్ రాజ్కా రూ.8.8 కోట్ల పరిహారంతో అగ్రస్థానంలో నిలవగా, చీఫ్ డెలివరీ ఆఫీసర్లు దినేష్ ఆర్ రూ.7.2 కోట్లు, సతీష్ హెచ్‌సీ రూ.6.9 కోట్లతో తర్వాతి స్థానాల్లో నిలిచారు.

ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈ అధిక సంపాదనలో మూడింట ఒక వంతు కంటే ఎక్కువ మంది 2000 సంవత్సరానికి ముందు నుండి ఇన్ఫోసిస్‌లో ఉన్నారు. కొందరు 1990 నాటివారూ ఉన్నారు. ఉద్యోగుల ప్రయోజనాల కోసం ఇన్ఫోసిస్ మొత్తం వ్యయం 2025 ఆర్థిక సంవత్సరంలో 4% పెరిగి రూ .85,950 కోట్లకు చేరుకుంది. ఇది దాని మొత్తం ఆదాయం రూ .1.63 లక్షల కోట్లలో 53 శాతం. 2025 మార్చి నాటికి కంపెనీ మొత్తం ఉద్యోగుల సంఖ్య 3.24 లక్షలుగా ఉంది.




## ఆఫ్‌రోడ్‌లో దూసుకెళ్లే 'జిమ్నీ'.. లక్ష మంది కొనేశారు..

ఆఫ్‌రోడ్‌లో దూసుకెళ్లే మారుతి సుజుకి జిమ్నీ విక్రయాల్లోనూ దూసుకెళ్లింది. సరికొత్త మైలురాయిని దాటింది. మారుతి సుజుకి జిమ్నీ మొదటిసారిగా 2023 జూన్‌లో భారత మార్కెట్లో లాంచ్ అయింది. అప్పటి నుండి ఈ ఆఫ్‌రోడ్ ఎస్‌యూవీ 5డోర్ల వెర్షన్ లక్ష యూనిట్లకు పైగా అమ్మకాలను నమోదు చేసింది. ఆటోకార్ ప్రొఫెషనల్స్ నివేదిక ప్రకారం.. రెండు సంవత్సరాలలో ఈ వాహనం మొత్తం 1,02,024 యూనిట్ల అమ్మకాలను సాధించింది.

మారుతి సుజుకి జిమ్నీ 5డోర్ మొత్తం విక్రయాల్లో దేశీయ మార్కెట్లో విక్రయించిన 26,180 యూనిట్లు (2025 ఏప్రిల్ చివరి వరకు లాంచ్ అయినవి), 75,844 ఎగుమతి యూనిట్లు (2025 ఏప్రిల్ చివరి వరకు లాంచ్ అయినవి) ఉన్నాయి. అయితే మారుతి సుజుకి జిమ్నీ అమ్మకాల సంఖ్య పరంగా దాని ప్రధాన ప్రత్యర్థులలో ఒకటైన మహీంద్రా థార్ శ్రేణి కంటే చాలా వెనుకబడి ఉంది. 2020 అక్టోబర్‌లో లాంచ్ అయినప్పటి నుండి 2025 ఏప్రిల్ చివరి వరకు మూడు డోర్ల థార్, థార్ రాక్స్ తో, ఎస్‌యూవీ శ్రేణి మొత్తం 2,59,921 యూనిట్లతో 2.5 లక్షల అమ్మకాల మైలురాయిని దాటింది.

మారుతి సుజుకి జిమ్నీ మూడు డోర్ల వర్షన్ ప్రపంచ మార్కెట్లో మంచి ప్రజాదరణ పొందింది. ఈ పాపులారిటీని పునరావృతం చేయడానికి కంపెనీ ఐదు డోర్ల వెర్షన్‌ను భారత మార్కెట్లో విడుదల చేసింది. ఆఫ్‌రోడర్ కొనుగోలుదారులను ఆకర్షించే లక్ష్యంతో ఈ వాహనం 4×4 సిస్టమ్‌తో బాడీఆన్‌ఫ్రేమ్ డిజైన్‌తో వచ్చింది. ఈ ఎస్‌యూవీ భారత మార్కెట్‌లో రూ .12.75 లక్షల (ఎక్స్ షోరూమ్) ప్రారంభ ధరతో అమ్ముడవుతోంది. దీనిని గురుగ్రామ్ ప్లాంట్లో తయారు చేసి జపాన్ వంటి అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేస్తున్నారు.

మారుతి సుజుకి జిమ్నీలో సింగిల్ 1.5లీటర్ నాలుగు సిలిండర్ల నేచురల్ ఆస్పిరేటెడ్ పెట్రోల్ ఇంజన్ ఉంది. ఇది 105 బీహెచ్‌పీ పవర్‌ని, 134 ఎన్ఎమ్ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇది 5స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్మిషన్ లేదా 4స్పీడ్ టార్క్ కన్వర్టర్ ఆటోమేటిక్‌తో జతచేయబడి ఉంటుంది. మాన్యువల్ వెర్షన్ లీటరుకు 16.94 కిలోమీటర్ల మైలేజ్ ఇస్తుండగా, ఆటోమేటిక్ వెర్షన్ లీటరుకు 16.39 కిలోమీటర్ల మైలేజ్ ఇస్తుంది.



## స్టాక్ మార్కెట్లు.. వరుస నష్టాలు

దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ నష్టాలతో ముగిశాయి. ఇజ్రాయెల్ఇరాన్ వివాదం పెరగడం, ముడిచమురు ధరలు విపరీతంగా పెరగడంతో భారత ఈక్విటీ బెంచ్‌మార్క్ సూచీలు పతనమయ్యాయి.ఇంట్రాడేలో 80,354.59 పాయింట్ల కనిష్టాన్ని తాకిన బీఎస్ఈ సెన్సెక్స్ 573.6 పాయింట్లు (0.7 శాతం) క్షీణించి 81,118.60 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 కూడా 169.6 పాయింట్లు లేదా 0.68 శాతం క్షీణించి 24,718.6 వద్ద ముగిసింది. విస్తృత మార్కెట్లలో నిఫ్టీ మిడ్ క్యాప్ 100, నిఫ్టీ స్మాల్ క్యాప్ 100 ఇండెక్స్ లు వరుసగా 0.24 శాతం, 0.43 శాతం నష్టపోయాయి.

అయితే రంగాలవారీ సూచీలు మిశ్రమంగా ముగిశాయి. నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్, నిఫ్టీ ఎఫ్ఎంసీజీలు 1 శాతానికి పైగా నష్టపోయాయి. నిఫ్టీ మెటల్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఆటో, ఎనర్జీ, ఫార్మా, కన్జ్యూమర్ డ్యూరబుల్స్, ఆయిల్ అండ్ గ్యాస్ షేర్లు నష్టాల్లో ముగిశాయి.సెన్సెక్స్ లోని 30 షేర్లలో 26 షేర్లు నష్టాల్లో ముగిశాయి. అదానీ పోర్ట్స్, ఐటీసీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1 శాతానికి పైగా నష్టపోయాయి. టెక్ మహీంద్రా, టీసీఎస్, సన్ ఫార్మా, మారుతీ సుజుకీ మాత్రమే లాభపడ్డాయి.

ఇజ్రాయెల్ఇరాన్ ఘర్షణ నేపథ్యంలో క్రూడాయిల్ ధర బ్యారెల్‌కు 8.57 శాతం పెరుగుదలతో 73.87 డాలర్లకు ఎగసింది. మరోవైపు మార్కెట్లలో అస్థిరతను అంచనా వేసే ఫియర్ ఇండెక్స్ (ఇండియా వీఐఎక్స్) 7.6 శాతం పెరిగి 15.08 పాయింట్ల వద్ద స్థిరపడింది.



# డెవిల్స్ డబుల్ నెక్స్ట్ లెవెల్: సంతానం హారర్ కామెడీ మూవీ ఎలా ఉందంటే?

సంతానం హీరోగా తెరకెక్కిన లేటెస్ట్ మూవీ 'డెవిల్స్ డబుల్ నెక్స్ట్ లెవెల్'. ఓటీటీ 'జీ 5'లో స్ట్రీమింగ్ అవుతున్న సినిమా ఎలా ఉందంటే?

'దిల్లుకు దుడ్డు' ఫ్రాంచైజీ చిత్రాలు కోలీవుడ్‌లో విజయాలు అందుకున్నాయి. అందులో భాగంగా తెరకెక్కిన నాలుగో సినిమా 'డెవిల్స్ డబుల్ నెక్స్ట్ లెవెల్'. ఇందులోనూ కమెడియన్ సంతానం ప్రధాన పాత్ర పోషించారు. మేలో థియేటర్లలో సందడి చేసిన ఈ మూవీ ప్రస్తుతం ఓటీటీ 'జీ 5'లో తెలుగులోనూ స్ట్రీమింగ్ అవుతోంది. మరి, పేరుకు తగ్గట్టు ఈ సినిమా నెక్స్ట్ లెవెల్‌లో ఉందా?


కృష్ణమూర్తి అలియాస్ కిస్సా (సంతానం) తన యూట్యూబ్ ఛానల్ వేదికగా సినిమాల రివ్యూలు ఇస్తుంటాడు. సినీ ప్రియులు, ప్రముఖుల నుంచి పొగడ్తలతోపాటు విమర్శలూ ఎదుర్కొంటాడు. ఓ సారి 'డీడీ నెక్స్ట్ లెవెల్' అనే సినిమా స్క్రీనింగ్‌కు కుటుంబంతో కలిసి హాజరై, రివ్యూ ఇవ్వాలంటూ కిస్సాకి ఆహ్వానం అందుతుంది. అక్కడికి వెళ్లాక అది దెయ్యాల థియేటర్ అని తెలిసి షాకై ఇంటికి తిరిగొస్తాడు. అయితే.. అప్పటికే అతడి ఫ్యామిలీ అదే థియేటర్‌కు వెళుతుంది. కుటుంబ సభ్యుల కోసం థియేటర్‌లోకి అడుగుపెట్టిన కిస్సాకు.. అక్కడి నుంచి బయట పడడం అసాధ్యమని అర్థమవుతుంది. అదే టైమ్‌లో ఓ వైపు సైకో కిల్లర్ ఎంట్రీతో సమస్యల వలయంలో చిక్కుకుంటాడు. కుటుంబంతో కలిసి కిస్సా ఎలా బయటపడ్డాడు? అసలు ఆ థియేటర్ ఎవరిది? తదితర అంశాలతో ఈ సినిమా రూపొందింది.ఈ ఫ్రాంచైజీలోని 'దిల్లుకు దుడ్డు', 'దిల్లుకు దుడ్డు 2', 'డీడీ రిటర్న్స్' స్టోరీలకు, 'డీడీ నెక్స్ట్ లెవెల్' కథకు సంబంధం ఉండదు. గత సినిమాలను చూడకపోయినా ఈ న్యూ మూవీ అర్థమవుతుంది. ఓ విధంగా ఇది.. రివ్యూలు ఇచ్చే యూట్యూబర్లపై రచయిత, దర్శకుడు ప్రేమ్ ఆనంద్ విసిరిన వ్యంగ్యాస్త్రం. మూవీ క్రిటిక్స్ హత్యకు గురవడం బాలీవుడ్ మూవీ 'చుప్'లో చూశాం. అలాంటి సీరియస్ అంశంతోనే 'డీడీ నెక్స్ట్ లెవెల్' ప్రారంభమైనా.. కాసేపటికే నవ్వుల ట్రాక్ ఎక్కుతుంది. తర్వాత హారర్ మోడ్‌లోకి వెళుతుంది. రివ్యూలతో ఎంతో పాపులర్ అయ్యాడంటూ డైలాగ్స్‌తో కిస్సా పాత్రను ఓ రేంజ్‌లో చూపించారు. అతడి రివ్యూ స్టైల్‌ని చూపించకపోవడం ప్రేక్షకుడికి అసంతృప్తే. సందర్భానుసారం వచ్చే కామెడీ తప్ప గత చిత్రాల్లోలాగా సంతానం పంచ్‌లు ఈ సినిమాలో ఆశించకపోవడం బెటర్

కిస్సా కుటుంబ నేపథ్యంలో సాగే సన్నివేశాల్లో కొత్తదనం లేదు. థియేటర్ నుంచి తన ఫ్యామిలీతోపాటు కిస్సా బయటపడేందుకు చేసే ప్రయత్నాలే సినిమా అంతా కనిపిస్తాయి. తెరపై సినిమా చూస్తున్న కిస్సా కుటుంబ సభ్యులు ఆ కథలోని పాత్రల్లాగా మారిపోవడం ఆసక్తికరం. ఆయా క్యారెక్టర్ల నుంచి వారిని ఎలాగైనా బటయకు తీసుకొస్తానని.. తమను ఆహ్వానించిన దెయ్యంతో ఛాలెంజ్ చేసిన కిస్సా నానా తంటాలు పడుతూ ప్రేక్షకుడిని నవ్విస్తాడు. అక్కడి నుంచి మరికొన్ని కొత్త పాత్రలు పరిచయం అవుతాయి. టైమ్‌పాస్ బాబుగా మొట్టై రాజేంద్రన్ తన మార్క్ హాస్యం పండించారు. రాఘవన్‌గా దర్శకుడు గౌతమ్ మేనన్ సర్‌ప్రైజ్ చేస్తారు. భారీ నౌకలో ప్రయాణించే వీరంతా ఊహించని విధంగా ఓ ఐలాండ్‌కు వెళ్లాల్సి వస్తుంది. కిస్సాకు అక్కడ మరిన్ని సవాళ్లు ఎదురవుతాయి. తన ప్రేయసి అక్కడ చనిపోవడాన్ని గుర్తించడంతో కథ మరో మలుపు తిరుగుతుంది. అయితే హారర్ పార్ట్ అంతగా భయపెట్టేదేం కాదు. తీక్షణంగా చూస్తేనే ఈ 'సినిమాలో సినిమా' అర్థమవుతుంది. సెకన్ల వ్యవధిలో ఒక జోన్ నుంచి మరో జోన్‌లోకి స్టోరీ షిఫ్ట్ అవడం కన్‌ఫ్యూజ్‌కు గురిచేస్తుంది.

కుటుంబంతో కలిసి చూడొచ్చా?: నిరభ్యంతరంగా చూడొచ్చు. అసభ్యకర సన్నివేశాలు లేవు. కానీ, ఒకట్రెండు వయలెన్స్ సీన్స్ ఉన్నాయి.

చివరిగా: 'డెవిల్స్ డబుల్'.. మరో లెవెల్ కాదు గానీ..!

గమనిక: ఈ సమీక్ష సమీక్షకుడి దృష్టి కోణానికి సంబంధించింది. ఇది సమీక్షకుడి వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే!




# సూపర్ హీరో 'శక్తిమాన్' పాత్రలో బన్నీ?



90స్ జనరేషన్‌కి సూపర్ హీరోలు అనగానే స్పైడర్ మ్యాన్, 'శక్తిమాన్' గుర్తొస్తాయి. స్పైడర్ మ్యాన్ సినిమాల సంగతి కాసేపు పక్కనబెడితే 'శక్తి మాన్' స్టోరీతో అటు సీరియల్ గానీ మూవీస్ గానీ రాలేదు. కొన్నాళ్ల క్రితం బాలీవుడ్ హీరో రణ్‌వీర్ సింగ్‌తో ఈ ప్రాజెక్ట్ తీస్తారనే టాక్ వినిపించింది. కానీ ఇప్పుడు ఫైనల్‌గా అది అల్లు అర్జున్ చేతిలోకి వచ్చిందనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఇంతకీ ఏంటి విషయం?

'పుష్ప 2' తర్వాత లెక్క ప్రకారం బన్నీ.. త్రివిక్రమ్‌తో సినిమా చేయాలి. భారీ బడ్జెట్‌తో మైథలాజికల్ మూవీ ఒకటి అనుకున్నారు. కానీ అది ఆలస్యమవుతూ వచ్చింది. మధ్యలో తమిళ దర్శకుడు అట్లీతో.. బన్నీ కొత్త సినిమాని అనౌన్స్ చేశాడు. ఇదో హాలీవుడ్ రేంజ్ సూపర్ హీరో తరహా సినిమా అని అనౌన్స్‌మెంట్ వీడియోతో క్లారిటీ ఇచ్చారు.

రీసెంట్‌గా బన్నీ చేయాల్సిన సినిమా ఎన్టీఆర్‌తో త్రివిక్రమ్ చేయబోతున్నట్లు క్లారిటీ వచ్చింది. దీంతో నెక్స్ట్ ఎవరితో చేస్తాడా అనే టైంలో రకరకాల రూమర్స్ వినిపిస్తున్నాయి. మలయాళ దర్శకుడు బాసిల్ జోసెఫ్ పేరు ఇప్పుడు వినిపిస్తుంది. గతంలో ఇతడు 'మిన్నల్ మురళి' అని లోకల్ సూపర్ హీరో మూవీ ఒకటి తీశాడు. ఈ క్రమంలోనే బన్నీబాసిల్ కలిసి 'శక్తిమాన్' చేస్తారనే రూమర్ ఇప్పుడు గట్టిగా వినిపిస్తుంది.

అంతర్జాతీయ నిర్మాణ సంస్థలు ఓ రెండు కలిసి.. గీతా ఆర్ట్స్‌తో భారీ ఎత్తున నిర్మించబోతున్నారని అంటున్నారు. త్వరలో ప్రకటన రావొచ్చని మాట్లాడుకుంటున్నారు. మరి ఇప్పుడు వినిపిస్తున్నవన్నీ నిజమేనా? లేదంటే త్రివిక్రమ్ ప్రాజెక్ట్ క్యాన్సిల్ అయిందని డ్యామేజ్ కంట్రోల్ ఏమైనా చేస్తున్నారా అనిపిస్తుంది. కొన్నిరోజులు ఆగితే నిజమేంటనేది క్లారిటీ రావొచ్చు.

# భర్తతో కలిసి వెకేషన్.. బేబీ బంప్ పిక్స్ వైరల్



మెగా కోడలు త్వరలో తల్లి కాబోతుంది. గత నెలలోనే వరుణ్ తేజ్ ఈ విషయాన్ని ప్రకటించాడు. తన భార్య లావణ్య త్రిపాఠి ప్రస్తుతం గర్భంతో ఉందని తెలియజేస్తూ పోస్ట్ పెట్టాడు. అప్పటినుంచి అటు వరుణ్ గానీ ఇటు లావణ్య గానీ మీడియా కంట పడట్లేదు. తాజాగా ఇద్దరూ కలిసి మాల్దీవుల్‌కు వెకేషన్ వెళ్లారు. ఆ ఫొటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ కాగా.. లావణ్య బేబీ బంప్‌తో కనిపించింది. కలిసి రెండు సినిమాలు చేసిన వరుణ్‌లావణ్య.. దాదాపు ఆరేడేళ్ల పాటు ప్రేమించుకున్నారు. అలా పెద్దల్ని ఒప్పించి 2023లో పెళ్లి చేసుకున్నారు. వివాహం తర్వాత చాలావరకు సినిమాలు తగ్గించేసిన లావణ్య.. అంతకు ముందే ఒప్పుకొన్న ఒకటి రెండు సినిమాలు, వెబ్ సిరీస్ పూర్తి చేసింది. అలా ఈ ఏడాది మే 6న తాను ప్రెగ్నెన్సీతో ఉన్న విషయాన్ని బయటపెట్టింది.ఇప్పుడు బేబీ బంప్‌తో బీచ్ ఒడ్డున భర్తతో కలిసి కనిపించింది. ప్రస్తుతం వరుణ్‌లావణ్య.. మాల్దీవుల్లోనే ఉన్నారు. ప్రస్తుత పరిస్థితి బట్టి చూస్తే మెగా కోడలు ఇప్పట్లో కొత్త సినిమాలు చేయడం కష్టమే. ఒకవేళ బిడ్డ పుట్టిన కొన్నేళ్ల తర్వాత మళ్లీ స్క్రీన్‌పై కనిపిస్తే కనిపించొచ్చు. లేదంటే మొత్తానికే కెరీర్‌ని వదిలేసినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. మరోవైపు వరుణ్.. ప్రస్తుతం మేర్లపాక గాంధీతో కలిసి ఓ హారర్ కామెడీ మూవీ చేస్తున్నాడు. ఇదివరకే కొంతమేర షూటింగ్ పూర్తయింది. త్వరలో కొత్త షెడ్యూల్ మొదలవుతుంది.



# తెలుగు నిర్మాతపై కాస్టింగ్ కౌచ్ కామెంట్స్.. క్లారిటీ ఇచ్చిన నటి

ఈ ఏడాది ప్రారంభంలో 'దంగల్' నటి ఫాతిమా సనా షేక్ ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. దక్షిణ చిత్ర పరిశ్రమలో కాస్టింగ్ కౌచ్ వల్ల ఇబ్బంది పడ్డానని చెప్పింది. హైదరాబాద్‌కు చెందిన కొందరు ఏజెంట్‌లు ఛాన్స్‌లు ఇప్పిస్తానంటూనే 'ఏదైనా చేయడానికి సిద్ధంగా ఉన్నారా..?' అని అడిగినట్లు తెలిపింది. ఆపై కొందరు టాలీవుడ్ నిర్మాతలు కూడా తనని పరోక్షంగా అలాంటి ప్రశ్నలే వేశారని చెప్పింది. ఆ సమయంలో ఆమె చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారమే రేగాయి. అయితే, తాజాగా మరోసారి ఫాతిమా రియాక్ట్ అయ్యారు.

దక్షిణాదిలో తాను క్యాస్టింగ్ కౌచ్ ఎదుర్కొన్నట్లు గతంలో చెప్పిన మాటలు నిజమేనని మరోసారి 'దంగల్' నటి ఫాతిమా పేర్కొంది. కానీ, తను చేసిన వ్యాఖ్యలను కొందరు తప్పుగా అర్థం చేసుకున్నారని తెలిపింది. ఒక వ్యక్తి వల్ల మాత్రమే తాను ఇబ్బంది ఎదుర్కొన్నానని క్లారిటీ ఇచ్చింది. అతను ఒక ఏజెంట్ కావచ్చు లేదా చిన్న నిర్మాత కావచ్చని చెప్పింది. కానీ, దక్షిణాది చిత్ర పరిశ్రమ మొత్తాన్ని తాను తప్పుపట్టలేదని స్పష్టత ఇచ్చింది. ఒకరి గురించి చెప్పిన మాటలను కొందరు అదేపనిగా అక్కడి పరిశ్రమ మొత్తాన్ని ఆపాదిస్తూ ప్రచారం చేయడం చాలా తప్పని పేర్కొంది. 'కాస్టింగ్ కౌచ్ అనేది ప్రతి పరిశ్రమలో ఉంది. అనేక రంగాలలో కూడా ఇలాంటి వాతావరణమే ఉంది. దారి వెంట వెళ్తున్న ఒక స్త్రీని అదేపనిగా చూస్తూ ఆమెను తప్పుగ చూసే వారు ఎందరో ఉన్నారు. వాటిని దాటుకుని నేటి మహిళ ముందుకు వెళ్తుంది.' అని ఆమె చెప్పింది.

ఫాతిమా గతంలో ఏం చెప్పిందంటే..

అమిర్ ఖాన్ నటించిన దంగల్ మూవీతో నటి ఫాతిమాకు మంచి గుర్తింపు వచ్చింది. గీతా ఫోగట్ పాత్రలో ఆమె అదరగొట్టేసింది. 2015లో ఆమె తెలుగులో నటించిన 'నువ్వు నేను ఒకటవుదాం' చిత్రం విడుదలైంది. ఆ మూవీ తర్వత మరో సినిమా చేస్తున్నక్రమంలోనే ఒక నిర్మాత నుంచి కాస్టింగ్ కౌచ్ ఎదుర్కొన్నట్లు గతంలో ఇలా చెప్పింది. 'హైదరాబాద్‌లో నేను చిన్నస్థాయి నిర్మాతలను కలుసుకున్నాను. ఒక హొటల్‌లో దిగాను. ఆ నిర్మాతలు కాస్టింగ్ కౌచ్ గురించి నాతో మాట్లాడారు. నీకు అవకాశం ఇవ్వాలంటే మేము చెప్పిందల్లా చేయాలని అన్నాడు. నేను కాదని చెప్పడంతో ఆ నిర్మాత నన్ను తదేకంగా చూస్తూ ఉండిపోయాడు. చాలా అసభ్యకరంగా క్యాస్టింగ్ కౌచ్ గురించి పచ్చిగానే అడిగేశాడు. ఇంకోకరు అదే విషయాన్ని డైరెక్ట్‌గా చెప్పకపోయినా.. వారు చెప్పినదాని అర్థం ఏమిటో స్పష్టంగా అర్థమైంది. ఒకప్పుడు బాలీవుడ్‌లో మంచి పాత్రలు రావడానికి సౌత్ సినిమా మొదటి అడుగు అని తాను నమ్ముతాను. కానీ, నాకు ఇలా జరుగుతుందని అనుకోలేదు.' అని ఆమె గతంలో వెల్లడించింది.



# నా జీవితాన్ని అందంగా మార్చినందుకు థాంక్యూ.. లవ్యూ బేబీ..

అమ్మతో పంచుకోలేనవి, నాన్నతో చెప్పుకోలేనివి, సోదరుడు/సోదరితో మాట్లాడలేనివి.. ఏవైనా సరే ఈ ఒక్క వ్యక్తి దగ్గర మాత్రం నిర్మొహమాటంగా మాట్లాడేస్తారు. మొహమాటాలకు అస్సలు తావుండదు. అతడే ఫ్రెండ్.. ఏ సమయంలోనైనా, ఎలాంటి పరిస్థితుల్లోనైనా అండగా ఉండేవాడే నిజమైన స్నేహితుడు. నమ్మి దోచుకునేవారికంటే నిజాయితీగా మసులుకునే ఫ్రెండ్ ఒక్కరున్నా చాలనుకునేవారు చాలామంది.

**ఫ్రెండ్స్ గ్యాంగ్**

మెగా డాటర్ నిహారికకు అలా చెప్పుకునే స్నేహితులు ముగ్గురున్నారు. వారే వితికా షెరు, మహాతల్లి జాహ్నవి, అంబటి భార్గవి. ఈ నలుగురు కలిశారంటే ప్రపంచాన్నే మర్చిపోతారు. తాజాగా వితికా షెరు .. నిహారికకు పెద్ద సర్‌ప్రైజ్ ప్లాన్ చేసింది. తనకోసం ఏం చేయాలా? అని ఆలోచించగా ఓ మంచి ఐడియా తట్టింది. నిహారిక పాటరీ స్టూడియోను అందంగా మార్చేసింది. భార్గవితో కలిసి ఆ పాటరీ గదిలోని ఓ గోడకు రంగు వేసింది. తర్వాత అక్కడున్న వస్తువుల్ని కొన్ని తీసేయించి అందంగా సర్దింది. కొన్ని పూలమొక్కల్ని కూడా గదిలో అలంకరించింది.

**నిహారికకు తెలియకుండా..**

ఈ సందర్భంగా ఓ ఆసక్తికర విషయం చెప్పింది. నిహారిక, నేను ఒకే టీచర్ దగ్గర పాటరీ (మట్టి పాత్రలు తయారు చేయడం) నేర్చుకున్నాం. మేము ఫ్రెండ్స్ అయ్యాక ఈ విషయం తెలుసుకున్నాం. నేను కుమ్మరి పనిలో బేసిక్స్ మాత్రమే వచ్చు. కానీ నిహారిక, భార్గవి డిగ్రీలు చేసేశారు అని చెప్పుకొచ్చింది. ఈ మేకోవర్ అంతా నిహారికకు తెలియకుండా చేసింది. తీరా ఆ పాటరీ స్టూడియోకు వచ్చిన నిహారిక.. తన గదిని అంత అందంగా మార్చిన వితికాను ముద్దులతో ముంచెత్తింది.

**దిష్టి తగలొద్దు**

వితికా చేసిన పనిని మెచ్చుకుంటూ నిహారిక సోషల్ మీడియాలో ఎమోషనల్ పోస్ట్ పెట్టింది. నీకు, నీ ప్రేమకు ఏ దిష్టి తగలకూడదు. తన ప్రేమను కాదనడం కష్టం అన్నంతగా ప్రేమిస్తుంది. నా జీవితాన్ని అందంగా మార్చినందుకు థాంక్యూ. నేను ఇంటికి తిరిగి వచ్చినప్పుడు కాస్తంత బాధలో ఉన్నాను. కానీ, నువ్వు చేసిన పని చూశాక నాపై కురిపిస్తున్న ప్రేమకు ముగ్ధురాలినైపోయాను. నువ్వెప్పుడూ నీ చుట్టూ ఉండే జనాల్ని ఎంతో స్పెషల్‌గా ఫీలయ్యేలా చేస్తావ్. చెప్పలేనంత ప్రేమ కురిపిస్తావ్. దీన్ని నేను గ్రాంటెడ్‌గా తీసుకోను.. నా జీవితంలోకి వచ్చిన నిన్ను అనునిత్యం ప్రేమిస్తూనే ఉంటాను. ఐ లవ్యూ బేబీ.. అని రాసుకొచ్చింది. ఇది చూసిన అభిమానులు.. వితికా లాంటి ఫ్రెండ్ దొరకడం అదృష్టం అని కామెంట్లు చేస్తున్నారు.







# మార్‌క్రమ్ సూపర్ సెంచరీ..
# రెండో ఐసీసీ ట్రోఫీ నెగ్గే దిశగా దక్షిణాఫ్రికా

**సౌతాఫ్రికా, ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న డబ్ల్యూటీసీ ఫైనల్ మ్యాచ్ జరుగుతోంది.**

**లార్డ్స్ :** ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ మూడో రోజు ఆట ముగిసింది. రెండోసారి ఐసీసీ ట్రోఫీని ఖాతాలో వేసే దిశగా దక్షిణాఫ్రికా అడుగులు వేస్తోంది. చివరిసారిగా 1998లో ఛాంపియన్స్ ట్రోఫీని సఫారీ జట్టు గెలుచుకుంది. ఇప్పుడు మరోసారి ఐసీసీ టైటిల్‌ను నెగ్గే అవకాశాన్ని సృష్టించుకుంది. డబ్ల్యూటీసీ ఫైనల్‌లో ఆస్ట్రేలియా నిర్దేశించిన 282 పరుగుల లక్ష్య ఛేదనలో దక్షిణాఫ్రికా 213/2 స్కోరుతో నిలిచింది. ఐదెన్ మార్‌క్రమ్ (102*) సెంచరీ సాధించగా.. తెంబా బావుమా (65*) హాఫ్ సెంచరీతో క్రీజ్‌లో ఉన్నారు. దక్షిణాఫ్రికా విజయానికి ఇంకా 69 పరుగులు అవసరం కాగా.. ఇంకా రెండు రోజుల సమయం మిగిలి ఉంది. వీరిద్దరూ మూడో వికెట్‌కు 143 పరుగులు జోడించారు. అంతకుముందు ర్యాన్ రికిల్‌టన్ (6), వ్యాన్ ముల్డర్ (27) తక్కువ స్కోరుకే పెవిలియన్‌కు చేరారు. ఆసీస్ బౌలర్ మిచెల్ స్టార్క్ 2 వికెట్లు పడగొట్టాడు.

దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా మధ్య ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్ మ్యాచ్ మూడో రోజు కొనసాగుతోంది. ఆస్ట్రేలియా నిర్దేశించిన 282 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన దక్షిణాఫ్రికా.. 35 ఓవర్లు ముగిసే సరికి 2 వికెట్లు కోల్పోయి 130 పరుగులు చేసింది. మిచెల్ స్టార్క్ బౌలింగ్‌లో రికెల్టన్ (6) కీపర్ అలెక్స్ క్యారీకి క్యాచ్ ఇచ్చి మొదటి వికెట్‌గా వెనుదిరిగాడు. అనంతరం జట్టు స్కోకు 70 పరుగుల వద్ద మిచెల్ స్టార్క్ బౌలింగ్‌లోనే లబుషేన్‌కు క్యాచ్ ఇచ్చి వియాన్ మల్డర్ (27) పెవిలియన్‌కు చేరాడు. ప్రస్తుతం మార్‌క్రమ్ (61), బవుమా(33) క్రీజులో ఉన్నారు. మూడో రోజు ఆట ముగించేందుకు మరో 30 ఓవర్లు ఆడాల్సి ఉంది.

లార్డ్స్: దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా మధ్య ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్ మ్యాచ్ మూడో రోజుకు చేరుకుంది. ఆస్ట్రేలియా నిర్దేశించిన 282 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో సౌతాఫ్రికా 13 ఓవర్లకు ఒక వికెట్ నష్టపోయి 51 పరుగులు చేసింది. ఇంకా 231 పరుగులు వెనకబడి ఉంది. మిచెల్ స్టార్క్ బౌలింగ్‌లో రికెల్టన్ 6 పరుగుల వద్ద కీపర్ అలెక్స్ క్యారీకి క్యాచ్ ఇచ్చి మొదటి వికెట్‌గా వెనుదిరిగాడు. ఐదెన్ మార్‌క్రమ్ 21, వియాన్ ముల్డర్ 23 పరుగులతో క్రీజులో ఉన్నారు. వీరు రెండో వికెట్‌కు 65 బంతుల్లో 42 పరుగుల భాగస్వామ్యాన్ని నమోదు చేశారు.

దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా మధ్య ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్ మ్యాచ్ లార్డ్స్ వేదికగా జరుగుతోంది. రెండో రోజు ఆటముగిసే సమయానికి ఆస్ట్రేలియా 8 వికెట్ల నష్టానికి 144 పరుగులు చేసింది. మూడో రోజు మరో 63 పరుగులు జోడించి.. తర్వాత 207 రన్స్‌కు ఆలౌటైంది. దక్షిణాఫ్రికా ముందు 282 పరుగుల విజయ లక్ష్యాన్ని ఉంచింది. రెండో ఇన్నింగ్స్‌లో ఆసీస్ బ్యాటర్లలో అలెక్స్ కేరీ 43, మిచెల్ స్టార్క్ 58* పరుగులు చేశారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో కగిసో రబాడా 4, లుంగి ఎంగిడి 3, మార్కో యాన్సెన్, వియాన్ ముల్డర్, ఐదెన్ మార్‌క్రమ్ తలో వికెట్ తీసుకున్నారు.

దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా మధ్య ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ ఫైనల్ మ్యాచ్ మూడో రోజు ఆట ప్రారంభమైంది. బౌలర్లకు పిచ్ అనుకూలిస్తుండటంతో మూడు రోజుల్లోనే ఫలితం తేలేలా ఉంది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా 8 వికెట్ల నష్టానికి 144 పరుగులు చేసింది. 218 పరుగుల ఆధిక్యంలో ఉంది. మిచెల్ స్టార్క్ 16, నాథన్ లైయన్ 1 క్రీజులో ఉన్నారు. అంతకు ముందు తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 212 పరుగులు చేయగలిగింది. తర్వాత బ్యాటింగ్ ప్రారంభించిన దక్షిణాఫ్రికా 138 పరుగులకు ఆలౌటైంది. అనంతరం ఆసీస్ తన రెండో ఇన్నింగ్స్ ప్రారంభించింది.

## ఐదు రోజుల్లో మూడు ప్రపంచ రికార్డులు
## నెలకొల్పిన కెనడా స్విమ్మర్

**విక్టోరియా:** కెనడా స్టార్ స్విమ్మర్ సమ్మర్ మెకింటోష్ మరో ప్రపంచ రికార్డు తన ఖాతాలో వేసుకుంది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే కెనడా జట్టును ఎంపిక చేసేందుకు నిర్వహించిన సెలెక్షన్ ట్రయల్‌స్‌లో 18 ఏళ్ల మెకింటోష్ ఐదు రోజుల వ్యవధిలో మూడో ప్రపంచ రికార్డు తిరగరాసింది. బుధవారం జరిగిన 400 మీటర్ల వ్యక్తిగత మెడ్లీ రేసులో 4 నిమిషాల 23.65 సెకన్లలో లక్ష్యాన్ని చేరి తన పేరిటే ఉన్న ప్రపంచ రికార్డును (4 నిమిషాల 24.38 సెకన్లు) తిరగరాసింది.



గత ఏడాది పారిస్ ఒలింపిక్స్‌లో మూడు స్వర్ణ పతకాలు సాధించిన మెకింటోష్... వచ్చే నెలలో సింగపూర్ వేదికగా జరగనున్న ప్రపంచ అక్వాటిక్స్ చాంపియన్‌షిప్‌లో సత్తా చాటేందుకు సిద్ధమవుతోంది. ఈ ట్రయల్‌స్‌లో భాగంగా ఇప్పటికే మెకింటోష్ 200 మీటర్ల వ్యక్తిగత మెడ్లీ, 400 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగాలలో రెండు ప్రపంచ రికార్డులు సృష్టించింది. 'పోటీకి ముందే ఏదో ప్రత్యేకంగా చేస్తానని అనుకున్నా. నా కెరీర్‌లో ఇది అత్యుత్తమ టోర్నీ. ప్రపంచ రికార్డులు నమోదయ్యేవి బద్దలవడానికే. కొలనుకు వీడ్కోలు చెప్పేంతవరకు వాటిపై నా పేరే ఉండే విధంగా చూసుకుంటా' అని మెకింటోష్ పేర్కొంది.

## విమాన ప్రమాద మృతులకు
## టీమ్‌ఇండియా నివాళులు

అహ్మదాబాద్‌లో గురువారం జరిగిన విమాన ప్రమాదంలో 265 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరికి టీమ్‌ఇండియా శుక్రవారం నివాళులు అర్పించింది.

గుజరాత్‌లోని అహ్మదాబాద్ నుంచి లండన్ బయలుదేరిన ఎయిరిండియా బోయింగ్ 7878 డ్రీమ్‌లైనర్ విమానం గురువారం ఘోర ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో 265 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరికి టీమ్ ఇండియా ఆటగాళ్లు నివాళులు అర్పించారు.

భారత జట్టు.. ఇంగ్లండ్ పర్యటన సందర్భంగా జూన్ 20 నుంచి అయిదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ ఆడనుంది. ఇందులో భాగంగా నేడు (శుక్రవారం) బెకెన్‌హామ్‌లో ఇంట్రా స్క్వాడ్ మ్యాచ్ ఆడుతోంది. దీనికి ముందు టీమ్‌ఇండియా ఆటగాళ్లు, సహాయక సిబ్బంది.. గురువారం జరిగిన విమాన ప్రమాదంలో మృతి చెందిన వారికి నివాళులు అర్పించారు. అనంతరం చేతికి నల్లటి బ్యాండ్‌లు ధరించి మ్యాచ్‌లో పాల్గొన్నారు. ఈ మేరకు చిత్రాలను బీసీసీఐ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది.



## వింబుల్డన్ విజేతకు
## రూ.34 కోట్లు

**వింబుల్డన్ ప్రైజ్‌మనీ భారీగా పెరిగింది. ఈ ఏడాది టోర్నీ నగదు బహుమతిని రూ.624 కోట్లుగా నిర్ణయించినట్లు ఆల్ ఇంగ్లాండ్ క్లబ్ అధికారులు వెల్లడించారు. గత సీజన్‌తో పోలిస్తే ఈ మొత్తం 7 శాతం అధికం కావడం విశేషం.**




**లండన్:** వింబుల్డన్ ప్రైజ్‌మనీ భారీగా పెరిగింది. ఈ ఏడాది టోర్నీ నగదు బహుమతిని రూ.624 కోట్లుగా నిర్ణయించినట్లు ఆల్ ఇంగ్లాండ్ క్లబ్ అధికారులు వెల్లడించారు. గత సీజన్‌తో పోలిస్తే ఈ మొత్తం 7 శాతం అధికం కావడం విశేషం. విజేతగా నిలిచే ప్లేయర్ రూ.34 కోట్లు సొంతం చేసుకోనున్నాడు. 2024తో పోలిస్తే ఇది 11.1 శాతం ఎక్కువ. ఈ టోర్నీలో పురుషులు, మహిళల విజేతలకు సమాన నగదు బహుమతి దక్కుతుంది. తొలి రౌండ్లో నిష్క్రమించే క్రీడాకారులకు రూ.76 లక్షలు దక్కనున్నాయి. "వింబుల్డన్ ప్రైజ్‌మనీని పెంచినందుకు గర్విస్తున్నాం. గత పదేళ్ల నుంచి ఈ నగదు బహుమతి పెంచుతూ వస్తున్నాం. గతేడాదితో పోలిస్తే ఈసారి 7 శాతం పెంపుదల ఉంది" అని ఆల్ ఇంగ్లాండ్ క్లబ్ డైరెక్టర్ డెబోరా జెవాన్స్ చెప్పాడు. ఈనెల 30న వింబుల్డన్ ఆరంభం కానుంది. జులై 13 వరకు ఈ టోర్నీ జరుగుతుంది. టోర్నీ చరిత్రలోనే తొలిసారిగా లైన్ జడ్జిలకు బదులుగా ఎలక్ట్రానిక్ లైన్ కాలింగ్‌ను అమలు చేస్తున్నారు.

## ఇంగ్లండ్ నుంచి భారత్‌కు తిరిగి రానున్న గౌతమ్ గంభీర్!

**కుటుంబంలో అత్యవసర పరిస్థితి తలెత్తడంతో గౌతమ్ గంభీర్ భారత్‌కు తిరిగి రానున్నట్లు వార్తలు వస్తున్నాయి**





టీమ్‌ఇండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఇంగ్లండ్ నుంచి భారత్‌కు తిరిగి రానున్నట్లు తెలుస్తోంది. కుటుంబంలో అత్యవసర పరిస్థితే దీనికి కారణమని సమాచారం. భారత సీనియర్ జట్టు కంటే ముందే గంభీర్ ఇంగ్లండ్ చేరుకున్నాడు. ఇంగ్లండ్ లయన్స్‌తో ఇండియా ఏ జట్టు రెండు అనధికార టెస్టు మ్యాచ్‌లు ఆడింది. ఇండియా ఏ జట్టు ప్రదర్శనను గంభీర్ దగ్గరుండి తిలకించారు. శుక్రవారం ఇండియా ఇంట్రా స్క్వాడ్ మ్యాచ్ ఆడుతోంది.

ఈ సమయంలోనే కుటుంబంలో అత్యవసర పరిస్థితి తలెత్తడంతో గంభీర్ భారత్‌కు తిరిగి రానున్నట్లు వార్తలు వస్తున్నాయి. గతంలో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ మధ్యలోనే గంభీర్ ఆస్ట్రేలియా నుంచి స్వదేశానికి కుటుంబ కారణాలతో తిరిగి వచ్చాడు. ప్రస్తుతం మరోసారి గంభీర్ జట్టుకు దూరమవడంతో.. శుక్రవారం నుంచి నాలుగు రోజులపాటు జరగనున్న ఇంట్రా స్క్వాడ్ మ్యాచ్‌ను అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ పర్యవేక్షించనున్నాడు. అతడికి బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్, బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్, ఇతర కోచింగ్ సిబ్బంది సహాయసహకారాలు అందించనున్నారు. జూన్ 20 నుంచి ఇంగ్లండ్‌తో భారత్ మొదటి టెస్ట్ మ్యాచ్ ఆడనుంది. దీనికంటే ముందే గంభీర్ తిరిగి వచ్చి జట్టుతో చేరే అవకాశం ఉంది.

## స్టీవ్ స్మిత్ జట్టులోకి బాబర్ ఆజం..

పాకిస్తాన్ సూపర్ స్టార్ బాబర్ ఆజం తొలిసారి ఆస్ట్రేలియా టీ20 టోర్నీ బిగ్ బాష్ లీగ్ లో ఆడేందుకు సిద్ధమయ్యాడు. బీబీఎల్ 202526 సీజన్ కోసం బాబర్ ఆజంతో సిడ్నీ సిక్సర్స్ ఫ్రాంచైజీ ఒప్పందం కదుర్చుకుంది. ప్రీ డ్రాఫ్ట్ ఒప్పందంలో భాగంగా సిడ్నీ ఫ్రాంచైజీ ఈ నిర్ణయం తీసుకుంది. ఆసీస్ స్టార్ ప్లేయర్ స్టీవ్ స్మిత్‌తో కలిసి బాబర్ సిడ్నీ ఇన్నింగ్స్‌ను ప్రారంభించే అవకాశముంది. స్మిత్ గత కొన్ని సీజన్లగా సిక్సర్స్ జట్టుకే ప్రాతనిధ్యం వహిస్తున్నాడు.





"ప్రపంచంలోని అత్యుత్తమ టీ20 లీగ్‌లలో ఒకటైన బిగ్ బాష్ లీగ్‌లో ఆడే అవకాశం రావడం చాలా సంతోషంగా ఉంది. నాకు ఈ అవకాశం కల్పించిన సిడ్నీ సిక్సర్స్ ఫ్రాంచైజీకి ధన్యవాదాలు. జట్టు విజయాల్లో నా వంతు పాత్ర పోషించేందుకు ఆతృతగా ఎదురు చూస్తున్నాను" అని సిడ్నీ సిక్సర్స్ రిలీజ్ చేసిన ప్రకటనలో ఆజం పేర్కొన్నాడు.

బీబీబీఎల్ 15వ సీజన్ డ్రాఫ్ట్ జూన్ 19న జరగనుంది. కాగా బాబర్ ఆజం ఇప్పటికే పీఎస్‌ఎల్‌తో పాటు సీపీఎల్, ఎల్‌పీఎల్, బీపీఎల్ వంటి పలు ఫ్రాంచైజీ క్రికెట్ లీగ్స్‌లో ఆడాడు. అయితే పాకిస్తాన్ టీ20 సెటప్ నుంచి బాబర్ ఆజంతో పాటు మహ్మద్ రిజ్వాన్, షాహీన్ అఫ్రిదిని పక్కన పెట్టాలని పీసీబీ భావిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే బాబర్ ఫ్రాంచైజీ క్రికెట్ లీగ్స్‌లో ఆడేందుకు ఆసక్తిచూపుతున్నట్లు తెలుస్తోంది.